/manamnews
www.manamnews.com

# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

కరీంనగర్
సోమవారం
23-10-2023
వెల. రూ.5
• సంపుటి : 7 • సంచిక : 264
పేజీలు : 8

KARIMNAGAR | HYDERABAD | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | AMARAVATHI | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA

అశ్వయుజ మాసం, సోమవారం, తిథి : నవమి సా.05.45 వరకు, నక్షత్రం: శ్రవణ, సా:05.14 వరకు, వర్జ్యం: సా.08.56-10.25 వరకు, దుర్ముహూర్తం: మ.12.23-01.09 వరకు, రాహుకాలం: ఉ.07.41-09.07 వరకు



పాఠకులకు, ఏజెంట్లకు, ప్రకటనకర్తలకు, శ్రేయోభిలాషులకు విజయదశమి శుభాకాంక్షలు పండుగ సందర్భంగా నేడు కార్యాలయానికి సెలవు. కావున మంగళవారం సంచిక వెలువడదు. పునఃదర్శనం బుధవారం

- యాజమాన్యం

**నాణ్యతా లోపం వల్లే మేడిగడ్డ బ్యారేజీ వంతెన కుంగింది** — రేవంత్‌రెడ్డి ఆరోపణ

**కాళేశ్వరం ప్రాజెక్టు మొత్తం అట్టర్ ఫ్లాప్** — బీజేపీ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి

**కుంగిన మేడిగడ్డ బ్యారేజీ వంతెన** 2

**మేడిగడ్డ బ్యారేజీ డిజైన్‌లో ఎలాంటి లోపం లేదు** — త్వరలోనే మరమ్మతులు పూర్తి చేస్తాం — ఈఎన్సీ వెంకటేశ్వర్లు 2




## విజయానికి చిహ్నంగా దసరా..

### పండుగ శుభాకాంక్షలు తెలిపిన సీఎం కేసీఆర్

**హైదరాబాద్, అక్టోబర్ 22 (మనం న్యూస్):** దసరా పండుగ సందర్భంగా ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ సాంస్కృతిక జీవన విధానంలో దసరాకు ప్రత్యేక స్థానం ఉన్నదని చెప్పారు. విజయానికి చిహ్నంగా దసరా పండుగను విజయదశమి పేరుతో దేశవ్యాప్తంగా జరుపుకుంటారని తెలిపారు. దసరా రోజున కుటుంబంలోని సభ్యులందరూ ఒకే చోట గుమికూడి

..మిగతా 2లో



## బీజేపీ తొలి జాబితా విడుదల

52 మందితో జాబితా వెల్లడి

హుజూరాబాద్, గజ్వేల్ నుంచి ఈటల రాజేందర్

కరీంనగర్ నుంచి బండి సంజయ్

కోరుట్ల నుంచి ధర్మపురి అర్వింద్ పోటీ చేయనున్నారు

వివరాలు.. 2లో

## ఎమ్మెల్యే రాజాసింగ్‌పై సస్పెన్షన్ ఎత్తివేత

రాజాసింగ్‌కు అడ్డంకులు తొలగినట్లే

ఏడాది తర్వాత బీజేపీ కార్యాలయానికి ఎమ్మెల్యే రాజాసింగ్

మళ్లీ గోషామహల్ నియోజకవర్గానికి పార్టీ అభ్యర్థిగా అధిష్ఠానం ప్రకటించింది



వివరాలు.. 2లో



















# కుంగిన మేడిగడ్డ బ్యారేజీ వంతెన

**శనివారం పొద్దుపోయాక భారీ శబ్దం**

**46 గేట్లు తెరిచి డ్యాంను ఖాళీ చేస్తున్న అధికారులు**

**తెలంగాణ - మహారాష్ట్ర మధ్య రాకపోకల నిలిపివేత**

**అసాంఘిక శక్తుల ప్రమేయం ఉండొచ్చనే అనుమానంతో పోలీసులకు ఫిర్యాదు**



జయశంకర్ భూపాలపల్లి, అక్టోబర్ 22 (మనం న్యూస్): కాళేశ్వరం ఎత్తిపోతల్లోని మేడిగడ్డ (లక్ష్మి) బ్యారేజీ వంతెన ఒక్కసారిగా కొంతమేరకు కుంగింది. శనివారం పొద్దుపోయాక భారీ శబ్దంతో బి-బ్లాకులోని 18, 19, 20, 21 పిల్లర్ల మధ్య ఉన్న వంతెన ఒక అడుగు మేర కుంగిపోయింది. బ్యారేజీ 20వ పిల్లర్ కుంగడంతోనే పైన వంతెన కుంగినట్లు అంచనా వేస్తున్నారు. బ్యారేజీ పొడవు 1.6 కిలోమీటర్లు ఉండగా సంఘటన జరిగిన ప్రదేశం మహారాష్ట్ర వైపు నుంచి 356 మీటర్ల సమీపంలో ఉంది. నీటిపారుదల శాఖ ఇంజినీర్లు డ్యాం పరిసరాల్లో అలర్ట్ ప్రకటించారు. మహారాష్ట్ర- తెలంగాణ రాష్ట్రాల మధ్య ఈ బ్యారేజీ పైనుంచి రాకపోకలు నిలిపివేశారు. గోదావరి నదిపై జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలో 2019లో మేడిగడ్డ వద్ద ఈ బ్యారేజీ నిర్మించారు. కాళేశ్వరం ఎత్తిపోతల్లో ఇది మొదటిది. శనివారం రాత్రి సమయానికి ఎగువ నుంచి జలాశయానికి 25 వేల క్యూసెక్కుల వరకు ప్రవాహం వస్తుండగా 8 గేట్లు తెరిచి దిగువకు వదులుతున్నారు. ఈ క్రమంలో శబ్దం రావడంతో ప్రాజెక్టు కార్యనిర్వాహక ఇంజినీరు తిరుపతిరావు, సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. వారు పరిశీలన చేస్తున్న సమయంలోనూ మరికొన్ని శబ్దాలు రావడంతో వెంటనే ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేశారు.

**సంఘటన సమయానికి 10.17 టీఎంసీల జలాలు**

16.17 టీఎంసీల సామర్థ్యం ఉన్న బ్యారేజీలో సంఘటన జరిగే సమయానికి 10.17 టీఎంసీల జలాలు ఉన్నాయి. రాత్రి సమయంలో వంతెన కుంగిన నేపథ్యంలో ఇంజినీర్లు ముందు జాగ్రత్త చర్యగా జలాశయాన్ని ఖాళీ చేయడం ప్రారంభించారు. మొదట 12 గేట్లు, ఆ తరువాత వాటిని 46కు పెంచి దిగువకు నీటిని విడుదల చేయడం ప్రారంభించారు. దాదాపు 50 వేల క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ఉదయానికి కొంత మేరకు జలాశయాన్ని ఖాళీ చేసి వంతెన కుంగిన ప్రాంతం దిగువన బ్యారేజీకి ఏమైనా నష్టం వాటిల్లిందా అనేది పరిశీలించనున్నట్లు ఇంజినీర్లు తెలిపారు.

**మేడిగడ్డ చేరుకున్న ఎల్అండ్టీ గుత్తేదారు సంస్థ నిపుణులు**

రెండు రాష్ట్రాల సరిహద్దులను కలిపే వంతెన కుంగడంతో ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా పోలీసులు రాకపోకలు నిలిపివేశారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. భారీ శబ్దం నేపథ్యంలో డ్యాం ఇంజినీర్లు మహారాష్ట్ర వైపు సిరోంచ, తెలంగాణ వైపు మహదేవపూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మరోవైపు ఎల్అండ్టీ గుత్తేదారు సంస్థ నిపుణులు కూడా అర్ధరాత్రికి మేడిగడ్డ చేరుకున్నారు. డ్యాం పైభాగాన్ని పరిశీలించిన ఈఈ తిరుపతిరావు మాట్లాడుతూ.. చీకటిగా ఉండటంతో ఏం జరిగిందనేది స్పష్టత లేదని తెలిపారు.

**నిరుడు 29 లక్షల క్యూసెక్కుల వరదను తట్టుకుంది..**

డ్యాం పైభాగంలో భారీ శబ్దం వచ్చిందని డ్యాం ఇంజినీర్లు సమాచారం అందించారని ఇంజినీర్ ఇన్ చీఫ్ (రామగుండం) నల్లా వెంకటేశ్వర్లు తెలిపారు. గతేడాది 29 లక్షల క్యూసెక్కుల వరదను డ్యాం ఎదుర్కొందని, నాడు రాని శబ్దాలు ఇప్పుడు రావడంపై పరిశీలన చేస్తున్నామన్నారు. అసాంఘిక శక్తుల ప్రమేయమేదైనా ఉండొచ్చనే అనుమానంతో పోలీసులకు ఫిర్యాదు చేయాలని ఇంజినీర్లను ఆదేశించాన్నారు. డ్యాం నిర్వహణ గుత్తేదారు పరిధిలోనే ఉన్నందున అవసరమైన మరమ్మతులు ఉంటే చేపడతామన్నారు.

## మేడిగడ్డ బ్యారేజీ డిజైన్‌లో ఎలాంటి లోపం లేదు

**ఈఎన్సీ వెంకటేశ్వర్లు**

మేడిగడ్డ: కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోవడంపై నిపుణుల బృందం పరిశీలిస్తోందని రామగుండం ఈఎన్సీ నల్లా వెంకటేశ్వరులు తెలిపారు. ఆదివారం సాయంత్రం ఆయన మీడియాతో మాట్లాడారు. మేడిగడ్డ ప్రాజెక్టు డిజైన్‌లో ఎలాంటి లోపం లేదని, ఈ ప్రాజెక్టును ఎల్ అండ్ టీ నిర్మించిందని చెప్పారు. బ్యారేజీ కుంగుబాటు తర్వాత నీటిని దిగువకు విడుదల చేశామని, త్వరలోనే మరమ్మతులు పూర్తి చేస్తామన్నారు. ప్రజల రక్షణను దృష్టిలో ఉంచుకొని, ఎవరినీ బ్యారేజీ పరిసరాల్లోకి అనుమతించలేదన్నారు. గతంలో 29 లక్షల క్యూసెక్కులు వచ్చినా బ్యారేజీ చెక్కు చెదరలేదని ఈ సందర్భంగా వెంకటేశ్వరులు వివరించారు. మేడిగడ్డ బ్యారేజీకి ఎలాంటి ముప్పులేదు. బ్యారేజీ బి బ్లాక్లో 20వ పిల్లర్ కుంగిపోయింది. నెల రోజుల వ్యవధిలోనే మరమ్మతులు పూర్తి చేస్తాం. ఘటనపై మహారాష్ట్ర, తెలంగాణ పోలీసులకు ఫిర్యాదు చేశాం అని వెంకటేశ్వర్లు తెలిపారు.

## నాణ్యతా లోపం వల్లే మేడిగడ్డ బ్యారేజీ వంతెన కుంగింది

**రేవంత్‌రెడ్డి ఆరోపణ**



న్యూఢిల్లీ/హైదరాబాద్, అక్టోబర్ 22 (మనం న్యూస్): నాణ్యతా లోపం వల్లే మేడిగడ్డ బ్యారేజీ వంతెన కుంగిందని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టు డొల్లతనం, నిజస్వరూపం ఇప్పుడు బయపడిందన్నారు. ఢిల్లీలో మీడియాతో రేవంత్ మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టు ప్రపంచానికే అద్భుతమని గొప్పలు చెప్పారు. రైతులను బస్సుల్లో తీసుకెళ్లి ఆ ప్రాజెక్టు చూపించారు. పంపు హౌస్లు మునిగినపుడు కాంగ్రెస్ నేతలను వెళ్లనివ్వలేదు. ఇప్పుడు వరదలు లేకుండానే బ్యారేజీ వంతెన కుంగిపోయింది. కాళేశ్వరంలో రూ.లక్ష కోట్ల అవినీతి జరిగిందని రాహుల్గాంధీ చెప్పారు, కాళేశ్వరం ప్రాజెక్టు డొల్లతనం, నిజస్వరూపం ఇప్పుడు బయటపడింది. ఆ ప్రాజెక్టు కేసీఆర్ కుటుంబానికి ఏటీఎంలా మారిందని చెప్తూనే ఉన్నాం. దీనిపై కేంద్రం ఇప్పటికైనా విచారణ జరిపించాలి. సెంట్రల్ విజిలెన్స్ కమిషన్‌తో దర్యాప్తు చేయించాలి. కాళేశ్వరం పనులపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి అని రేవంత్‌రెడ్డి డిమాండ్ చేశారు.

## కాళేశ్వరం ప్రాజెక్టు మొత్తం అట్టర్ ఫ్లాప్

**బీజేపీ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి**



హైదరాబాద్, అక్టోబర్ 22 (మనం న్యూస్): లక్ష్మి బ్యారెజ్ దెబ్బతిన్నట్లు వార్తలు వస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందనా లేదని రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి విమర్శించారు. ఆ బ్యారెజ్‌కు సంబంధించి ఇరిగేషన్ ఇంజనీర్లు మొదటి నుంచి అనుమానాలు వ్యక్తం చేస్తున్నారని, ఇప్పుడు అది దెబ్బతిన్నట్లు ప్రచారం జరుగుతుందన్నారు. ఆ బ్యారెజిని పరిశీలించడానికి ఈటెల రాజేందర్ వెళ్తున్నట్లు కిషన్‌రెడ్డి తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టు మొత్తం అట్టర్ ఫ్లాప్. కాళేశ్వరం తెలంగాణ సంపదకు చిల్లుగా మారింది. కాళేశ్వరానికి భారీగా నిధులు కేటాయించారు మూడేళ్లలోనే మేడిగడ్డ వంతెన కుంగిపోవడం దారుణం. ఎక్స్‌పర్ట్‌గా, సూపర్ ఇంజనీర్‌గా భావించి తనకు తాను కేసీఆర్ జబ్బలు చరుచుకున్నారు. 2019 జూన్ 21న కాళేశ్వరం ప్రాజెక్ట్ ప్రారంభించారు. ప్రాజెక్టుపై సమగ్ర దర్యాప్తు చేయాలి. అవినీతి పరిపాలనపై బీజేపీ పోరాటం. కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు కవలపిల్లలు. ఎన్ని టీఎంసీల నీరు వ్యవసాయానికి అందించారు. ఇప్పటి వరకు 150 టీఎంసీల నీటిని మాత్రమే అందించారు. హడావిడిగా ప్రచారం కోసం కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మించారు. గోదావరి వరదలతో నీటి పంపులు మునిగిపోయి చాలా నష్టం జరిగింది. ప్రాజెక్ట్ పై సమగ్ర దర్యాప్తు చేయాలని డిమాండ్ చేస్తున్నాం. డ్యాం సేఫ్టీ అథారిటీ ఆహ్వానించి పరిశీలించాలని కోరుతున్నా. డ్యాం సేఫ్టీపై నిపుణుల బృందాన్ని పంపాలని జలశక్తి మంత్రికి లేఖ రాస్తున్న. జనసేన పొత్తుపై ఇంకా నిర్ణయం తీసుకోలేదు అని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

## అప్పుడు మాట్లాడిన కేసీఆర్ ఇప్పుడు మాట్లాడరేం!: భట్టి



హైదరాబాద్: ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన రీడిజైనింగ్ వల్లే కాళేశ్వరం నష్టదాయకంగా మారిందని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టు రాష్ట్రానికి గుదిబండగా మారిందన్నారు. నాణ్యతాలోపం వల్లే మేడిగడ్డ బ్యారేజీ వంతెన కుంగిపోయిందని, డిజైన్లు తానే రూపొందించానన్న కేసీఆర్ ఇప్పుడెందుకు మాట్లాడరని భట్టి ప్రశ్నించారు. గతేడాది వరదల్లో పంపుహౌసులు మునిగి భారీగా నష్టం వాటిల్లిందని ఆయన విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టు అద్భుతం అని కేసీఆర్, కేటీఆర్ పదేపదే అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు ప్రపంచానికే అద్భుతమని గొప్పలు చెప్పారు. రూ.30వేల కోట్లతో పూర్తయ్యే ప్రాజెక్టుకు రూ.లక్ష కోట్లు ఖర్చు చేశారు. తెలంగాణ ప్రజల సొమ్మును కేసీఆర్ గోదావరిలో పోశారు అని భట్టివిక్రమార్క విమర్శించారు.

## బీజేపీ తొలి జాబితా విడుదల

న్యూఢిల్లీ/హైదరాబాద్, అక్టోబర్ 22 (మనం న్యూస్): తెలంగాణ ఎన్నికలకు సంబంధించి 52 మందితో కూడిన తెలంగాణ బీజేపీ తొలి జాబితా విడుదలైంది. హుజూరాబాద్, గజ్వేల్ నుంచి ఈటల రాజేందర్ పోటీ చేయనున్నారు. కరీంనగర్ నుంచి ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ బరిలోకి దిగనున్నారు. కోరుట్ల నుంచి ధర్మపురి అర్వింద్ పోటీ చేయనున్నారు. పాతబస్తీలో అన్ని స్థానాల నుంచి పోటీకి బీజేపీ సిద్ధమైంది. తొలి జాబితాలో 12 మంది మహిళలకు అవకాశం ఇచ్చింది. ముగ్గురు ఎంపీలను బరిలోకి దింపింది. బీసీలు-16, ఎస్సీలు-8, ఎస్టీలు-6, ఓసీలు-10 మందికి స్థానాలు కేటాయించింది.

**అభ్యర్థులు వీళ్లే..**

సిర్పూర్ - పాల్వాయి హరీశ్ బాబు
బెల్లంపల్లి (ఎస్సీ) - అమరాజుల శ్రీదేవి
ఖానాపూర్ (ఎస్టీ) - రమేశ్ రాథోడ్
ఆదిలాబాద్- పాయల్ శంకర్
బోథ్ (ఎస్టీ)- సోయం బాపూరావు
నిర్మల్- ఏలేటి మహేశ్వర్ రెడ్డి
ముథోల్ - రామారావు పటేల్
ఆర్మూరు- పైడి రాకేశ్ రెడ్డి
జుక్కల్ (ఎస్సీ) - టి.అరుణ తార
కామారెడ్డి -వెంకట రమణా రెడ్డి
నిజామాబాద్ అర్బన్- సూర్యనారాయణ గుప్తా
బాల్కొండ - ఆలేటి అన్నపూర్ణమ్మ
కోరుట్ల- ధర్మపురి అర్వింద్
జగిత్యాల - బోగ శ్రావణి
ధర్మపురి -ఎస్.కుమార్
రామగుండం - కందుల సంధ్యారాణి
కరీంనగర్- బండి సంజయ్
చొప్పదండి (ఎస్సీ) - బొడిగె శోభ
సిరిసిల్ల - రాణి రుద్రమ రెడ్డి
మానకొండూరు( ఎస్సీ)- ఆరెపల్లి మోహన్
హుజురాబాద్ - ఈటల రాజేందర్
నర్సాపూర్ - మురళీ యాదవ్
పటాన్చెరు - నందీశ్వర్ గౌడ్
దుబ్బాక - రఘునందన్ రావు
గజ్వేల్- ఈటల రాజేందర్
కుత్బుల్లాపూర్- కూన శ్రీశైలం గౌడ్
ఇబ్రహీంపట్నం- నోముల దయానంద్‌గౌడ్
మహేశ్వరం- అందెల శ్రీరాములు యాదవ్
ఖైరతాబాద్- చింతల రామచంద్రారెడ్డి
కార్వాన్- అమర్సింగ్
గోషామహల్- రాజాసింగ్
చార్మినార్-మేఘారాణి
చాంద్రాయణగుట్ట- సత్యనారాయణ ముదిరాజ్
యాకుత్పురా-వీరేందర్ యాదవ్
బహదూర్‌పురా- నరేశ్‌కుమార్
కల్వకుర్తి- తాల్లోజు ఆచారి
కొల్లాపూర్- ఎ.సుధాకర్‌రావు
నాగార్జునసాగర్- కంకణాల నివేదితారెడ్డి
సూర్యాపేట- సంకినేని వెంకటేశ్వరరావు
భువనగిరి- గూడూరు నారాయణరెడ్డి
తుంగతుర్తి- కడియం రామచంద్రయ్య
జనగామ- ఆరుట్ల దశమంత్‌రెడ్డి
స్టేషన్ ఘన్పూర్(ఎస్సీ)- డాక్టర్ గుండే విజయరామారావు
పాలకుర్తి- లేగ రామ్మోహన్‌రెడ్డి
డోర్నకల్ (ఎస్టీ)- భుక్యా సంగీత
మహబూబాబాద్ (ఎస్టీ)- జతోత్ హుస్సేన్ నాయక్
వరంగల్ వెస్ట్- రావు పద్మ
వరంగల్ ఈస్ట్- ఎర్రబెల్లి ప్రదీప్‌రావు
వర్ధన్నపేట (ఎస్సీ)- కొండేటి శ్రీధర్
భూపాలపల్లి- చందుపట్ల కీర్తిరెడ్డి
ఇల్లెందు (ఎస్టీ)- రవీందర్ నాయక్
భద్రాచలం (ఎస్టీ)- కుంజా ధర్మారావు

## ఎమ్మెల్యే రాజాసింగ్‌పై సస్పెన్షన్ ఎత్తివేత



హైదరాబాద్, అక్టోబర్ 22 (మనం న్యూస్): గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్‌పై బీజేపీ సస్పెన్షన్ ఎత్తివేసింది. వివాదాస్పద వ్యాఖ్యల నేపథ్యంలో గతంలో గతేడాది ఆగస్టు 23న ఆయన్ను బీజేపీ సస్పెండ్ చేసింది. వ్యాఖ్యలపై వివరణ ఇవ్వాలని ఆ పార్టీ ఆయన్ను ఆదేశించింది. దీంతో రాజాసింగ్ తన వివరణ ఇచ్చారు. ఆయన వివరణను పరిగణనలోకి తీసుకున్న బీజేపీ.. తాజాగా సస్పెన్షన్ను ఎత్తివేస్తున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు బీజేపీ కేంద్ర క్రమశిక్షణ సంఘం సభ్య కార్యదర్శి ఓం పాఠక్ ఓ ప్రకటన విడుదల చేశారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో బీజేపీ సస్పెన్షన్ ఎత్తివేయడంతో రాజాసింగ్‌కు ఊరట లభించినట్లయింది. ఈసారి గోషామహల్ నుంచే పోటీ చేస్తానని ఇప్పటికే ఆయన ప్రకటించారు.

గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ బీజేపీ కార్యాలయానికి వచ్చారు. దాదాపు ఏడాది తర్వాత ఆయన పార్టీ కార్యాలయంలో అడుగుపెట్టారు. గతేడాది రాజాసింగ్‌ను బీజేపీ అధిష్ఠానం సస్పెండ్ చేసింది. అప్పటి నుంచి ఆయన పార్టీ కార్యాలయానికి దూరంగా ఉన్నారు. తాజాగా ఆయనపై ఉన్న సస్పెన్షన్ను ఎత్తివేయడంతో పాటు.. మళ్లీ గోషామహల్ నియోజకవర్గానికి పార్టీ అభ్యర్థిగా అధిష్ఠానం ప్రకటించింది. ఈ నేపథ్యంలో ఆయన భారీ ర్యాలీగా ఆదివారం పార్టీ కార్యాలయానికి వచ్చి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని కలిశారు. రాముడికి 14 ఏళ్ల వనవాసం ఉంటే.. తనకు తనకు 14 నెలలు వనవాసం వేశారని ఈ సందర్భంగా రాజాసింగ్ నవ్వుతూ వ్యాఖ్యానించారు.

## మళ్లీ బీఆర్ఎస్‌కే ఆధిక్యం

**మిషన్ చాణక్య సర్వే రిపోర్టు**

హైదరాబాద్, అక్టోబర్ 22 (మనం న్యూస్): తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో మళ్లీ బీఆర్ఎస్‌కే ఆధిక్యమంటూ మిషన్ చాణక్య సర్వే రిపోర్టు తేల్చింది. ఓట్ షేర్‌పై మిషన్ చాణక్య నిర్వహించిన సర్వేలో బీఆర్ఎస్-44.62 శాతం, కాంగ్రెస్-32.71 శాతం, బీజేపీ-17.6 శాతం, ఇతరులకు 5.04 శాతం ఓట్లు వస్తాయని సర్వే అంచనా వేసింది. కాగా, తెలంగాణలో అధికార బీఆర్ఎస్ పార్టీ మరోసారి అధికారంలోకి రాబోతోందని ఇండియా టీవీ సర్వే కూడా వెల్లడించిన సంగతి తెలిసిందే. ఒపీనియన్ పోల్స్ ఫలితాలను విడుదల చేసిన ఇండియా టీవీ.. బీఆర్ఎస్‌కు 70, కాంగ్రెస్‌కు 34, బీజేపీకి 7, ఎంఐఎంకు 7 సీట్లు వస్తాయని పేర్కొంది. కాగా, 2018 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు 88, కాంగ్రెస్‌కు 19, ఎంఐఎం 7, ఇతరులు నాలుగు చోట్ల విజయం సాధించారు.

# ఢిల్లీలో 'పాలేరు' సీటు పంచాయితీ



న్యూఢిల్లీ/హైదరాబాద్, అక్టోబర్ 22 (మనం న్యూస్): కాంగ్రెస్, వామపక్షాల పొత్తు వ్యవహారం ఇంకా ఒక కొలిక్కి రాలేదు. ఆయా పార్టీల మధ్య రాజకీయ అవగాహన కుదిరినా, సీట్లపై ఇంకా అస్పష్టత కొనసాగుతూనే ఉంది. వామపక్షాలు, కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకత్వాలు ఇప్పటికీ సీట్లపై కసరత్తు చేస్తూనే ఉన్నాయి. పాలేరు సీటు కోసం కాంగ్రెస్, సీపీఎం మధ్య పోటీ నెలకొంది. కాంగ్రెస్ నుంచి పొంగులేటి శ్రీనివాస్రెడ్డి, సీపీఎం నుంచి తమ్మినేని వీరభద్రం మధ్య పాలేరు సీటు పంచాయితీ సాగుతోంది. పాలేరు సీటు తమకే కావాలని సీపీఎం నేతలు డిమాండ్ చేస్తుండగా, పాలేరుకు బదులు వైరా స్థానం ఇస్తామని కాంగ్రెస్ నచ్చచెబుతోంది. పాలేరు సీటు కోసం సీపీఎం పట్టుబడుతుంది. సీటు వ్యవహారంపై పొంగులేటి శ్రీనివాస్రెడ్డిని ఢిల్లీకి పిలిపించి చర్చిస్తున్నట్లు సమాచారం. పొంగులేటి, తుమ్మల ఇప్పుడు కాంగ్రెస్‌కు రాష్ట్రస్థాయిలో ప్రముఖులుగా ఉన్నారు. దీంతో పొంగులేటికి పాలేరు, తుమ్మలకు ఖమ్మం స్థానాలు ఇచ్చే యోచనలో కాంగ్రెస్ ఉంది. ఈ నేపథ్యంలో పాలేరు స్థానాన్ని సీపీఎంకు ఇచ్చే పరిస్థితి కనిపించడం లేదు. ఈ స్థానంలో సీపీఎం తరపున ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అభ్యర్థిగా ఉండాలని భావిస్తున్నారు. ఆ స్థానం ఇవ్వకుంటే పొత్తుకు సీపీఎం అంగీకరించే పరిస్థితి కనిపించడం లేదు. విచిత్రమేంటంటే ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సీపీఎం కోరే సీట్లన్నీ కీలకమైనవే. గతంలో మధిర స్థానాన్ని కూడా సీపీఎం ప్రతిపాదించింది. ఆ స్థానంలో భట్టి విక్రమార్క అనేకసార్లు విజయం సాధించారు. ఇలా కాంగ్రెస్‌కు పట్టున్న స్థానాలను సీపీఎం కోరుతుండటంతో కాంగ్రెస్ పార్టీ చిక్కుల్లో పడింది. ఏదిఏమైనా ఇప్పుడు కాంగ్రెస్ అధిష్టానం కోర్టులో లెఫ్ట్ సీట్ల వ్యవహారం ఉంది. పొత్తు అంశం త్వరగా కొలిక్కి రావాలని కామ్రేడ్లు వేచి చూస్తున్నారు.

## తుది దశకు చేరిన కసరత్తు..

**25న కాంగ్రెస్ రెండో జాబితా?**

హైదరాబాద్, అక్టోబర్ 22 (మనం న్యూస్): తెలంగాణ కాంగ్రెస్ అభ్యర్థుల రెండో జాబితా ప్రకటనపై స్క్రీనింగ్ కమిటీ కసరత్తు తుదిదశకు చేరినట్లు తెలుస్తోంది. వరుసగా రెండో రోజు కూడా ఢిల్లీలో సమావేశమైన స్క్రీనింగ్ కమిటీ అభ్యర్థుల ఎంపికపై విస్తృతంగా చర్చించింది. మొదటి జాబితాలో 55 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించిన కాంగ్రెస్.. మిగిలిన 64 నియోజకవర్గాలకు అభ్యర్థుల ఎంపికపై కసరత్తు ముమ్మరం చేసింది. ఇప్పటికే 35 నుంచి 40 నియోజకవర్గాలకు చెందిన అభ్యర్థులపై ఏకాభిప్రాయం కుదిరినట్లు తెలుస్తోంది. ఈనెల 25న కేంద్ర ఎన్నికల కమిటీ సమావేశం కానుంది. అదే రోజున కాంగ్రెస్ రెండో జాబితా విడుదలయ్యే అవకాశం ఉందని కాంగ్రెస్ వర్గాలు వెల్లడిస్తున్నాయి.

**వామ పక్షాలతో కొలిక్కిరాని సీట్ల సర్దుబాటు..**

వామపక్షాలతో కాంగ్రెస్‌కు పొత్తు కుదిరినా.. సీట్ల సర్దుబాటుపై పీటముడి వీడలేదని తెలుస్తోంది. అయితే, వరుసగా రెండో రోజు కూడా సీట్ల సర్దుబాటుపై స్క్రీనింగ్ కమిటీ చర్చించినప్పటికీ.. ఏకాభిప్రాయం కుదరలేదని సమాచారం. సీపీఐకి కొత్తగూడెం, చెన్నూరు, సీపీఎంకు మిర్యాలగూడ, వైరా సీట్లు ఇచ్చేందుకు కాంగ్రెస్ ప్రతిపాదించినట్లు తెలుస్తోంది. వైరాకి బదులు పాలేరు సీటు కోసం సీపీఎం పట్టుబడుతున్నట్లు తెలుస్తోంది. పాలేరు ఇవ్వడానికి ససేమిరా అంటున్న కాంగ్రెస్.. వైరా సీటుతో సరిపెట్టుకోవాలని సీపీఎం నేతలను ఒప్పించేందుకు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. సీట్ల సర్దుబాటుపై మరొకసారి రాష్ట్ర నాయకత్వం వామపక్షాలతో కూర్చొని చర్చించే అవకాశం ఉందని తెలుస్తోంది.

## తెలంగాణ కోసం మేం పదవులు కోల్పోయాం

**కాంగ్రెస్ సీనియర్ నేత జానారెడ్డి**



హైదరాబాద్: కాంగ్రెస్ పాలనలోనే దేశాభివృద్ధి జరిగిందని కాంగ్రెస్ సీనియర్ నేత జానారెడ్డి అన్నారు. 1995 నాటికే ఐదు లక్షల గ్రామాలకు కాంగ్రెస్ విద్యుత్ ఇచ్చిందని తెలిపారు. దేశ స్వాతంత్ర్యం కోసం కాంగ్రెస్ నాయకులే పోరాడారన్న ఆయన.. తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చింది కూడా కాంగ్రెస్ పార్టీయేనని గుర్తు చేశారు. హైదరాబాద్లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో జానారెడ్డి మాట్లాడారు. పార్టీకి నష్టం జరుగుతుందని తెలిసి కూడా తెలంగాణ ఇచ్చామన్నారు. తెలంగాణ రాష్ట్రం కోసం మేం పదవులు కూడా కోల్పోయాం. ఉపాధి హామీ, ఆహారభద్రత, సమాచార హక్కు చట్టాలు తెచ్చింది కాంగ్రెస్ కాదా? ఉచిత విద్యుత్, రూపాయికి కిలో బియ్యం ఇచ్చింది కాంగ్రెస్సే. సీఎం కేసీఆర్ ఏ ఒక్క హామీని నిలబెట్టుకోలేదు. రూ.లక్ష రుణమాఫీ ఇప్పటికీ పూర్తి చేయలేదు. తొలివిడతలో రుణమాఫీకి ఐదేళ్లు పట్టడంతో రైతులపై వడ్డీ భారం పడింది. రెండో విడత రుణమాఫీని అసలు పూర్తి చేయలేదని జానారెడ్డి విమర్శించారు.

## విజయానికి చిహ్నంగా దసరా..

(మొదటిపేజీ తరువాయి)

సామూహికంగా సంబురాలు జరుపుకోవడం తెలంగాణ సబ్బండ వర్గాల ఐక్యతకు నిదర్శనంగా నిలుస్తుందన్నారు. శమీపూజ చేసి జమ్మి ఆకును బంగారంగా భావించి అలాయ్ బలాయ్ తీసుకోవడం.. పెద్దల ఆశీర్వాదం తీసుకోవడం శుభసూచకంగా భావించే పాలపిట్టను దర్శించుకోవడం తెలంగాణ ప్రాంతానికి ప్రత్యేకమని సీఎం అన్నారు. పోరాడి సాధించుకున్న తెలంగాణ అస్తిత్వాన్ని కాపాడేందుకు, అగ్రపథాన కొనసాగించేందుకు విజయ దశమి స్ఫూర్తితో అలుపెరుగని పోరాటం కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణకు నిత్య విజయాలు కలిగేలా దుర్గామాత కృపాకటాక్షాలు ప్రజలందరిపై ఉండాలని, ప్రజలందరికీ సుఖసంతోషాలను ప్రసాదించాలని సీఎం కేసీఆర్ దుర్గామాతను ప్రార్థించారు.

## మేనిఫెస్టో, తొమ్మిదేళ్ల పాలనా ఫలాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

**కేటీఆర్, హరీశ్‌రావు**

**పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డికి సంస్కారం నేర్పాలి..**

**జానారెడ్డికి కేటీఆర్ స్ట్రాంగ్ కౌంటర్**



హైదరాబాద్, అక్టోబర్ 22 (మనం న్యూస్): ఎన్నికల సన్నద్ధతలో భాగంగా క్షేత్రస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు అన్ని రకాలుగా సమాయత్తమవ్వడం కోసం ప్రతి నియోజకవర్గంలో ఎన్నికల వార్ రూమ్‌ల ఏర్పాటు చేశామని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మంత్రి కేటీఆర్ తెలిపారు. వార్ రూమ్‌ల ఇన్ఛార్జిలతో మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు హైదరాబాద్‌లోని జలవిహార్లో సమావేశం నిర్వహించారు. మేనిఫెస్టో, తొమ్మిదేళ్ల పాలన ఫలాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు కేటీఆర్, హరీశ్‌రావు దిశానిర్దేశం చేశారు. మూస పద్ధతులతో కాకుండా.. కొత్త తరహాలో ప్రజలకు చేరువ కావాలని చెప్పారు. సోషల్ మీడియా ద్వారా కొత్త ఓటర్లకు చేరువ కావాలని పిలుపునిచ్చారు. మేనిఫెస్టోను మరింత విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని, కాంగ్రెస్ దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని సూచించారు. సంస్కారమంటే ఏమిటో కాంగ్రెస్ నుంచి నేర్చుకోవాల్సిన ఖర్మ తమకు పట్టలేదని కేటీఆర్ అన్నారు. జానారెడ్డి, పీసీసీ అధ్యక్షుడికి సంస్కారం నేర్పించాలన్నారు. కిషన్‌రెడ్డి ఎన్నికల రణరంగంలో వెన్నుచూపి పారిపోయారని కేటీఆర్ వ్యాఖ్యానించారు. భాజపాకు 100.. కాంగ్రెస్‌కు 40 స్థానాల్లో అభ్యర్థులు లేరన్నారు. క్షేత్రస్థాయిలో ప్రజలు తమతోనే ఉన్నారని చెప్పారు భారాస గతం కన్నా మెరుగైన ఫలితాలతో ఘన విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కేసీఆర్ ముచ్చటగా మూడోసారి ముఖ్యమంత్రి కావడం ఖాయమని సర్వే రిపోర్టులు కూడా స్పష్టం చేస్తున్నాయన్నారు.

# దేశ సేవే పరమావధిగా ఆర్ఎస్ఎస్

- కరీంనగర్ విభాగ్ ప్రచారక్ భానుచందర్ జీ



తిమ్మాపూర్, అక్టోబర్ 22, (మనం న్యూస్): సమాజ హితం శ్రేయస్సు, దేశ సేవ కోసమే రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ పనిచేస్తుందని జాతీయవాదమే పరమావధిగా జీవించే ఏకైక స్వచ్ఛంద సంస్థ ఆర్ఎస్ఎస్ అని కరీంనగర్ విభాగ్ ప్రచారక్ భాను చందర్ జి తెలిపారు. కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం మహాత్మనగర్ గ్రామపంచాయతీ పరిధిలోని సెయింట్ ఆంటోనీ పాఠశాలలో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ప్రాథమిక శిక్ష శిబిరం కార్యక్రమాలుగత వారం రోజులుగా జరుగుతుండగా, ఆదివారం శిక్షణ శిబిరం ముగింపు సమారోహ్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన సమావేశంలో విభాగ్ ప్రచారక్ భానుజీ మాట్లాడుతూభారతదేశంలో 1925 సంవత్సరంలో నాగపూర్‌లో విజయదశమి రోజున డాక్టర్ కేశవ్ బలి రామ్ హెగ్డే వార్ రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ను స్థాపించారని, భారతీయ సంస్కృతిని, సమాజాన్ని బలోపేతం చేయడానికి ఆర్ఎస్ఎస్ విశేష కృషి చేస్తుందన్నారు. దేశ నాగరికత, సాంప్రదాయాల్ని నిలబెట్టడమే అన్నింటికంటే విలువైనదనే విషయాన్ని ఆర్ఎస్ఎస్ బలంగా విశ్వసిస్తుందన్నారు. ఆర్ఎస్ఎస్ భావజాలాన్ని ఎంతోమంది విశ్వసిస్తు న్నారని, అందుకే ప్రపంచంలోనే అత్యధికమైన స్వయం సేవకులు కలిగిన స్వచ్ఛంద సంస్థగా ఆర్ఎస్ఎస్ ఖ్యాతిగాంచిం దన్నారు. ఆర్ఎస్ఎస్ స్వయం సేవకులు, శిక్షార్థులు తమ తమ ప్రాంతాల్లో సమాజ, ధార్మిక, యోగా కార్యక్రమాలపై దృష్టి సారించి దేశ హితం కోసం పనిచేయాలని సూచించారు. ఈ ముగింపు సమావేశంలో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ బాధ్యులు సంఘ చాలాక్ మల్లోజుల కిషన్ జీ, జిల్లా సహా సంఘచాలకులు ఎలగందుల సత్యనారాయణ, పాక సత్యనారాయణ, అశోక్ రావు, రాజశేఖర్ జి, సందీప్ జి, బాలరాజు, విద్యా సాగర్ రెడ్డి, కిరణ్ జి, తడగొప్పుల శంకరయ్య,గికురి శ్రీనివాస్, మురళికృష్ణ, పద్మారెడ్డి, నర్సింగరావు, సంపత్ లతో పాటు బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఇనుకొండ నాగేశ్వర్ రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి బొంతల కళ్యాణ్ చంద్ర, చింతం శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలందరికి నేడు విజయదశమి పండుగ శుభాకాంక్షలు

- ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి



వీణవంక, అక్టోబర్ 22, (మనం న్యూస్) : హుజురాబద్ నియోజకవర్గ ప్రజలందరికి నేడు దసరా పండుగను పురస్కరించుకొని శాసనమండలి సభ్యులు, ప్రభుత్వ విప్,బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డి ప్రతి ఒక్కరికి పేరుపేరున శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ విజయదశమి అందరికి విజయాలు అందించాలని, దుర్గమ్మతల్లి దీవెనలతో మనమందరం సుఖసంతోషాలతో ఉండాలని కోరుకుంటున్నానన్నారు. తెలంగాణలో కెసీఆర్ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి రాష్ట్రంలో సకాలంలో వర్షాలు కురుస్తున్నాయని పంటలు పండుతున్నాయని రైతులు ఆర్థికంగా ఎంతో పుంజుకున్నారని, సీఎం కెసీఆర్ పాలనలో రాష్ట్రం అభివృద్ధిలో ఎంతో ముందుందని, అన్ని వర్గాల ప్రజల శ్రేయస్సు కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తూన్నారని అన్నారు. తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి బిఆర్ఎస్ పార్టీతోనే సాధ్యమన్నారు. విజయదశమి పండుగను ప్రతి ఒక్కరు కుటుంబసభ్యులు, బంధువులు, స్నేహితులతో ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని ఆకాంక్షించారు.

## ఘనంగా సద్దుల బతుకమ్మ వేడుకలు



వీణవంక, అక్టోబర్ 22, (మనం న్యూస్): మండలంలోని అన్ని గ్రామాలలో సద్దులబతుకమ్మ (పెద్దబతుకమ్మ) పండుగను పురస్కరించుకొని ప్రజలు తీరొక్క పూలతో వరుసకో రంగు పూలను పెట్టి పోటీ పడుతూ బతుకమ్మలను పేర్చి మహిళలు అందులో గౌరమ్మను తయారు చేసి పెట్టి గంధం, పసుపు, కుంకుమ, బుక్కగులాలు, అక్షింతలు వేసి బతుకమ్మలను ఇంట్లో ఉన్న దేవుని ముందు పెట్టి దూపదీ పనైవేద్యాలు సమర్పించారు. చిన్నారులు, యువతులు, మహిళలు పట్టువస్త్రాలు,ఆభరణాలు ధరించి సాయంత్రం నాలుగు గంటలకు డప్పుచప్పుల మధ్య బతుకమ్మలను పట్టుకొని గ్రామాలలో ఏర్పాటు చేసిన బతుకమ్మ ఆట స్థలానికి చేరుకొని బతుకమ్మలను కింద పెట్టి బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో, చిత్తు చిత్తుల బొమ్మ శివుని ముద్దులగుమ్మ,రామ రామ ఉయ్యాలో అంటూ పాటలు పాడుతూ, కోలాటాలు వేస్తూ బతుకమ్మల చుట్టూ తిరుగుతూ ఆడుకున్నారు. వయస్సు,హోదాతో తేడా లేకుండా మహిళలు చిన్నపిల్లల వలె పండుగ సంబురాలు జరుపుకున్నారు. చివరకు పోయిరా గౌరమ్మ పోయిరావమ్మ అంటూ గౌరమ్మ పాటలు పాడి ఒకరికొకరు వాయినాలు ఇచ్చిపుచ్చుకున్నారు.

## నగరంలో బీజేపీ సంబరాలు



కరీంనగర్, అక్టోబర్ 22, (మనం న్యూస్) : జరగబోయే శాసన సభ ఎన్నికల్లో కరీంనగర్ శాసనసభ బిజెపి టికెట్ ఎంపి బండి సంజయ్‌కి ఇవ్వడంతో నగర బిజెపి పశ్చిమ జోన్ అధ్యక్షులు ఆధ్వర్యంలో జగిత్యాల రోడ్డులోని స్పెన్సర్స్ స్వాగత్ హోటల్ ముందు బిజెపి శ్రేణులు డప్పులతో టపాసులు కాలుస్తూ స్వీట్ పంపిణీ చేశారు. బిఆర్ఎస్ పాలనపై ప్రజలు తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారని, కరీంనగర్ స్థానానికి జరగనున్న ఎన్నికల్లో ప్రజలు బిజెపినీ అత్యధిక మెజార్టీతో గెలిపించడానికి సిద్ధంగా ఉన్నారని లక్ష్మారెడ్డి తెలిపారు.ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు బండ రమణారెడ్డి, రాపర్తి ప్రసాద్ ,మామిడిపల్లి రమేష్, జాడి బాల్రెడ్డి, బాలు, ప్రసన్న రెడ్డి, సిద్ది సంపత్, ఈ రెడ్డి తిరుమలరెడ్డి, అబిడి మాధవరెడ్డి, వంగల రవికుమార్, సర్దార్ ర చన్ సింగ్, ఉపేందర్ బండారి శ్రీను, పాశం నరసింహారెడ్డి, కొంగల రాజిరెడ్డి, చంద్రగిరి వేణు రమేష్ చంద్ర, చంద్రశేఖర్, విద్యాసాగర్, నరేష్, తదితరులు పాల్గొన్నారు

## సద్దుల బతుకమ్మ ఉత్సవాలలో పాల్గొన్న ఎమ్మెల్యే వొడితల

- బతుకమ్మ, విజయదశమి శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే



చిగురుమామిడి, అక్టోబర్ 22, (మనం న్యూస్): పూలనే దేవునిగా కొలిచి తీరొక్క పూలతో బతుకమ్మగా పేర్చి ఆడబిడ్డలు జరుపుకునే సంబురం, పోయి రావమ్మ బతుకమ్మ వచ్చే ఏడాదికి మళ్ళీ రావమ్మా. మా పాడిపంటలు, పిల్లాజేల్లా సల్లగా చూసి సకలసౌభాగ్యాలను ఇవ్వమ్మా అని తెలంగాణలో ప్రతి ఆడబిడ్డ, ప్రతి ఇల్లు మొక్కే ప్రకృతి పండుగ సద్దులబతుకమ్మ సందర్భంగా హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్-డాక్టర్ షమితమ్మ దంపతులు వారి నివాసంలో బతుకమ్మను పేర్చి, బతుకమ్మకు, దేవీ నవరాత్రుల సందర్భంగా దుర్గమ్మ వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి సంబరాలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్ మాట్లాడుతూ హుస్నాబాద్ నియోజకవర్గ ప్రజలకు, అక్కచెల్లెళ్లకు, అన్నదమ్ములకు యువకులకు పేరుపేరునా బతుకమ్మ మరియు విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలందరూ పండుగను ఆనందోత్సవాల మధ్య జరుపుకోవాలని అందరూ సంతోషంగా ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు.

## దసరా పండుగ శుభాకాంక్షలు



వీణవంక, అక్టోబర్ 22, (మనం న్యూస్): నేడు దసరా పండుగ సందర్భంగా మండలంలోని శ్రీరాములపేట గ్రామ సర్పంచ్ కొల్లూరి సంధ్యబాపురావు గ్రామస్తులందరికి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చెడుపై మంచిని సాధించిన గుర్తుగా దసరా పండుగను జరుపుకోవడం జరు గుతుందని అన్నారు. అమ్మవారి దయతో గ్రామస్తులందరూ పాడి పంటలతో, ఆయురారోగ్యాలతో సంతోషంగా ఉండాలని అన్నారు.

## రామగుండం ప్రజలు ఓటు వేసి ఆశీర్వదించాలి

- రామగుండం కాంగ్రెస్ అభ్యర్థి రాజ్ ఠాకూర్




గోదావరిఖని, అక్టోబర్ 22, (మనం న్యూస్): ప్రజలు కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి తనను ఆశీర్వదించాలని రామగుండం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మక్కాన్సింగ్ రాజ్ ఠాకూర్ కోరారు. ఆదివారం గోదావరిఖని గౌతమి నగర్ లోని గ్లోరియస్ మినిస్ట్రిస్ చర్చిలో జరిగిన ఆరాధనలో రాజ్ ఠాకూర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత 25 సంవత్సరాలుగా ఈ ప్రాంత సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తున్నానని, ఈ ప్రాంత అభివృద్ధి కోసం పోరాడుతున్నానని అన్నారు.ప్రాంత నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పిస్తామని అన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి నన్ను అసెంబ్లీకి పంపించాలని కోరారు. అనంతరం మక్కాన్ సింగ్ ఎమ్మెల్యేగా గెలవాలని పాస్టర్లు ప్రార్థనలు చేసి ఆశీర్వదించారు.ఈ కార్యక్రమంలో పెద్దెల్లి ప్రకాశ్, భూషణ్, సత్యనారాయణ రెడ్డి, గుంపుల తిరుపతి, చెప్పు రాజిరెడ్డి, వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## విరిసింది పూల సింగిడి

- వైభవంగా సద్దుల బతుకమ్మ వేడుకలు
- ఆటపాటల మధ్య గౌరమ్మను కొలుచుకున్న ఆడపడుచులు



కరీంనగర్ బ్యూరో, అక్టోబర్ 22, (మనం న్యూస్): ''ఒక్కేసి పువ్వేసి చందమామ.. ఒక్క జాము ఆయే చందమామ''.. ''బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో.. బంగారు బతుకమ్మ ఉయ్యాలో''.. అంటూ ఆడపడుచులు అమ్మవారిని బతుకమ్మ రూపంలో భక్తి శ్రద్ధల మధ్య కొలుచుకున్నారు. ఎంగిలిపూల బతుకమ్మతో ప్రారంభమైన ఉత్సవాలను ఎనిమిది రోజుల పాటు నిర్వహించుకున్న మహిళలు తొమ్మిదవ రోజున పెద్ద బతుకమ్మ రూపంలో ఆరాధించారు. ఆదివారం ఉదయం నుంచి వివిధ రకాలైన పూలతో అందంగా పేర్చిన బతుకమ్మలకు పూజలు నిర్వహించిన అనంతరం సాయంత్రం ఒక్క చోటికి చేర్చి, కోలాటాలు, ఆటపాటల మధ్య గౌరమ్మను కొలిచారు. మహిళలు, యువతులు, చిన్నారులు అనే తారతమ్యం లేకుండా సంబరంగా బతుకమ్మ ఆటలను కొనసాగించారు. దాదాపు మూడు నుంచి నాలుగు గంటల పాటు ఆట పాటలతో కొలుస్తూ అమ్మవారిని



స్తుతించారు. అనంతరం బతుకమ్మలను నిమజ్జనం చేసి ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా మహిళలు ఒకరికొకరు పసుపు, కుంకుమ, వాయనాలతో పాటు పలహారాలను ఇచ్చిపుచ్చుకున్నారు. కరీంనగర్ జిల్లా కేంద్రంతో పాటు జిల్లా వ్యాప్తంగా ఏ మూలన చూసినా బతుకమ్మ ఉత్సవాల కోలాహలం కనిపించింది. నగరంతో పాటు పట్టణాలు, పల్లెలు అనే తేడా లేకుండా వీధులన్నీ బతుకమ్మలతో పూలమయమైపోయాయి. కరీంనగర్‌లోని డివిజన్‌లతో పాటు ప్రాంతాల వారిగా, అపార్టుమెంట్లు, వీధులల్లో మహిళలు ఒక్క చోటకు చేరి ఎక్కడి వారక్కడ బతుకమ్మ ఆటల్లో మునిగిపోయారు. కొత్త బట్టలు ధరించిన మహిళలు, వివిధ రకాల పూలతో అందంగా అలంకరించిన బతుకమ్మలతో వీధులన్నీ కళకళలాడాయి. నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో ప్రతి వీధిలో బతుకమ్మ ఉత్సవాల సందర్భంగా ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. బతుకమ్మ ఆటపాటల అనంతరం నిమజ్జనం జరిపేందుకు మానేరు డ్యాం వద్ద ఏర్పాట్లు చేపట్టారు. ఈ సందర్భంగా ఆ ప్రాంతంలో బతుకమ్మలను నిమజ్జనం చేసేందుకు ప్రత్యేకంగా సిబ్బందిని నియమించారు. నిమజ్జనం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా పోలీసు యంత్రాంగం కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టింది.

**చిగురుమామిడిలో...**

చిగురుమామిడి మండలంలోని 17 గ్రామాల్లో ఆదివారం సద్దుల బతుకమ్మ పండుగను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు వివిధ రకాల పూలతో బతుకమ్మలున అందంగా పేర్చి, కోలాటాలు, ఆటపాటలతో గౌరమ్మను భక్తి శ్రద్ధల మధ్య కొలుచుకున్నారు. ప్రస్తుత బతుకమ్మ పర్వదినం ఎన్నికల సందడి మధ్య సాగుతుండడంతో మండలంలోని గ్రామగ్రామాన వివిధ రాజకీయ పార్టీల ఫ్లెక్సీలు జోరు పెరిగింది. వివిధ పార్టీల నాయకులు బతుకమ్మ, దసరా పండుగల శుభాకాంక్షలు తెలుపుతూ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలతో గ్రామాలు నిండిపోయాయి.

## బిఆర్ఎస్ ప్రభుత్వాన్ని బొంద పెట్టడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారు

- బీఎస్పీ ఎమ్మెల్యే అభ్యర్థి దాసరి ఉష



పెద్దపల్లి, అక్టోబర్ 22, (మనం ప్రతినిధి) : బహుజన్ సమాజ్ పార్టీ పెద్దపల్లి నియోజకవర్గ బీఎస్పీ ఎమ్మెల్యే అభ్యర్థి దాసరి ఉష సమక్షంలో పెద్దపల్లి స్వగృహం నందు నేడు వెన్నంపల్లి, రేగిడిమద్దికుంట, మియాపూర్, రాగినేడు, రాఘవపూర్, గ్రామల నుండి 150 మంది పైగా పార్టీతో ఆదివారం చేరారు. వారికి దాసరి ఉష పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం దాసరి ఉష మాట్లాడుతూ వెన్నంపల్లి గ్రామం నుండి దొమ్మటి ప్రబాకర్,వార్డ్ మెంబర్ పెరుక సంఘ జిల్లా ఉపాధ్యక్షులు, కలవేన రవీందర్, మాజీ వార్డ్ మెంబర్, ఈర్ల సదానందం, మాజీ వార్డ్ మెంబర్, మిలుకుల సదానందం, మాజీ వార్డు మెంబర్, కూర్మ మధుకర్, వార్డ్ మెంబర్, రేగడిమద్దికుంట గ్రామం నుండి నల్లగొండ స్వామి, 2వ వార్డ్ మెంబర్ (బిఆర్ఎస్)వారితో పాటు వారి అనుచరులు, రాగినేడు గ్రామం నుండి ఎరవెళ్లి సురేందర్, రాజు, తెలంగాణ మాల మహానాడు పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు, మియాపూర్ రాఘవపూర్ గ్రామాల నుండి కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలకు చెందిన యువకులు పెద్ద ఎత్తున చేరినట్లు తెలిపారు. అదేవిధంగా పెద్దపల్లిలో బిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలలో బీసీ,ఎస్సీ,ఎస్టీ, మత మైనారిటీలకు తగిన న్యాయం జరగక నేడు బిఎస్పిని పార్టీని పెద్దపల్లి ప్రజలు ఆదరిస్తున్నారని అన్నారు. అవినీతి బిఆర్ఎస్ ప్రభుత్వాన్ని బొంద పెట్టడానికి ప్రజల సిద్ధంగా ఉన్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా ఉపాధ్యక్షులు తోట వెంకటేష్ పటేల్, పెద్దపల్లి అసెంబ్లీ మహిళా కన్వీనర్ అముధల అరుణ, అసెంబ్లీ కోశాధికారి ఎండి రియాజ్, సుల్తానాబాద్ మండల అధ్యక్షులు బోయిని రంజిత్, ఉపాధ్యక్షులు కొల్లూరి నర్సయ్య, కోశాధికారి అల్లెపు చంద్రశేఖర్,తదితరులు పాల్గొన్నారు.

## కుంగిన బ్యారేజీలపై ముఖ్యమంత్రి బాధ్యత వహించాలి

- ప్రజల సొమ్ము నీళ్ళ పాలు
- మంథని ఎమ్మెల్యే దుద్దిల్ల శ్రీధర్ బాబు




మంథని, అక్టోబర్ 22, (మనం న్యూస్) : మేడిగడ్డ,లక్ష్మీ బ్యారేజ్ వంతెన ప్రమాదంపై మంథని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు స్పందించారు. మేడిగడ్డ బ్యారేజ్ వంతెన ఒక్కసారిగా కొంతమేర కుంగిందని శనివారం సాయంత్రం సమయంలో భారీ శబ్దంతో బి-బ్లాక్ లోని 18,19,20,21 పిల్లర్ల మధ్య ఉన్న వంతెన ఒక అడుగు మేర కుంగిపోయిందని మంథని ఎమ్మెల్యే దుద్దిల్ల శ్రీధర్‌బాబు కీలక వ్యాఖ్యలు చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో ముఖ్యమంత్రి కేసీఆర్ బాధ్యత వహించాలని మంథని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు డిమాండ్ చేశారు. తక్కువ సమయంలో నాణ్యత లేకుండా నిర్మాణం చేపట్టి గొప్పలు చెప్పుకుంటున్న ప్రభుత్వం కుంగిపోయిన బ్యారేజ్‌పై ఏం సమాధానం చేప్తుందని ఆయన ప్రశ్నించారు. ప్రజల సొమ్మును నీళ్లలో పోశారని ఆయన ఆగ్రహించారు. ఇంజనీరింగ్ అధికారులు చేసిన తప్పిదాన్ని ఇరిగేషన్ ప్రిన్సిపల్ సెక్రటరీ,ముఖ్యమంత్రి కేసీఆర్ బాధ్యత వహించాలన్నారు. కుంగిన బ్యారేజ్ లను మా జాతీయ నాయకుడు రాహుల్ గాంధీ చూడడానికి రావాలా అని ఎద్దేవా చేశారు. ఎంపీపీ కొండ శంకర్, చొప్పరి సదానందం, ఓడ్నాల శ్రీనివాస్, మండల నాయకులు, సీనియర్ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## నేడు శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



వీణవంక, అక్టోబర్ 22, (మనం న్యూస్) : మండలంలోని మామిడాలపల్లి గ్రామంలో కొలువైన శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో నేడు(సోమవారం) స్వామివారి జన్మనక్షత్రమైన శ్రవణమును పురస్కరించుకొని తెల్లవారుజామున 5గంటలకు అంగ ప్రదక్షిణలు, 7 గంటలకు శ్రీవారికి అభిషేకం, ఉదయం 9-30గంటలకు స్వామివారి కళ్యాణము నిర్వహించబడునని ఆలయ అర్చకులు సంతోష్‌చార్యులు తెలిపారు. కళ్యాణ దాతలుగా రామోజు సత్యనారాయణ-శైలజ, పాకాల లక్ష్మారెడ్డి -రమా దేవి, పుప్పాల రఘు-చైతన్య దంపతులు వ్యవహరిస్తున్నారని, కావున భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కళ్యాణాన్ని తిలకించి స్వామి వారి కృపకు పాత్రులు కాగలరని కోరారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ వైస్ చైర్మన్ గాదె రమణారెడ్డి, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఒక అవకాశం ఇవ్వండి... అభివృద్ధి పరుస్తా

- డిసిసి అధ్యక్షులు రాజ్ ఠాకూర్
- కాంగ్రెస్ పార్టీలోకి పలువురు చేరిక




గోదావరిఖని, అక్టోబర్ 22, (మనం న్యూస్) : రామగుండం నియోజకవర్గ ప్రజలు ఈ ప్రాంతాన్ని అభివృద్ధి పరిచేందుకు, ఈ ప్రాంతంలో ఉన్న సమస్యలను తీర్చేందుకు ఒక అవకాశం కల్పించాలని పెద్దపెల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మక్కాన్‌సింగ్ ఠాకూర్ కోరారు.ఆదివారం కాజీపల్లిలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మేకల పోషం, దేవేందర్ రెడ్డి, నర్సింహా రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 200 మంది మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి కాంగ్రెస్ పార్టీ కండువ కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ నీటి సమస్యను, రోడ్ల సమస్యలను, ఈ ప్రాంత నిరుద్యోగ సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తానని, ప్రశ్నించే గొంతుగా నన్ను అసెంబ్లీకి పంపిస్తే రామగుండం ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తానని కోరారు. నవంబర్ 30న జరిగే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి ఒక అవకాశం ఇవ్వాలని ప్రజలను కోరారు.

## గౌరీ మాతను దర్శించుకున్న చల్మెడ లక్ష్మీ నరసింహారావు



వేములవాడ, అక్టోబర్ 22, (మనం న్యూస్): శ్రీ దేవి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో మహా గౌరీ మాతా అలంకారంలో కొలువుదీరిన అమ్మవారిని బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆదివారం రాజన్న ఆలయంలో స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులు నియోజకవర్గ ప్రజలందరిపై ఉండాలన్నారు. ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని ఆ అమ్మవారిని వేడుకున్నారు. ఆయన వెంట బిఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు పుల్కం రాజు, కౌన్సిలర్లు నిమ్మశెట్టి విజయ్, మారం కుమార్, కొండ కనకయ్య, ఇప్పపూల అజయ్, సిరిగిరి చందు, జోగిని శంకర్, నాయకులు గన్నమనేని రామారావు, తీగల వెంకటేశ్వరరావు, నాయకులు ముద్రకోలా వెంకటేశం పాల్గొన్నారు.

# అంతర్జాతీయ ఖ్యాతి గడించేలా నిర్మిస్తే.. ఎందుకు కుంగిపోయింది..?

- మేడిగడ్డ బ్యారేజ్ విషయమై కెసిఆర్ సమాధానమివ్వాలి
- కాళేశ్వరం ప్రాజెక్టు అవకతవకలపై సిబిఐచే దర్యాప్తు చేపట్టాలి
- ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ రాష్ట్ర ఉపాధ్యక్షులు జోజిరెడ్డి




కరీంనగర్, అక్టోబర్ 22, (మనం న్యూస్): కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం విషయంలో అంతర్జాతీయ ఖ్యాతి గడించామని చెప్పుకున్న బిఆర్ఎస్ ప్రభుత్వం మేడిగడ్డ బ్యారేజ్ ఎందుకు కుంగిపోయిందో ప్రజలకు సమాధానం చెప్పాలని ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అంబటి జోజిరెడ్డి సవాల్ విసిరారు. నాణ్యత ప్రమాణాలను పట్టించుకోకుండా ఈ ప్రాజెక్టు నిర్మాణం చేపట్టడం వల్లనే బ్యారేజి కుంగిపోయిందని ఆరోపించారు. గతంలో కాళేశ్వరం ప్రాజెక్టును సందర్శించేందుకు వాహనాల్లో తరలించిన బిఆర్ఎస్ ప్రభుత్వం, ఇప్పుడు తమనెందుకు అడ్డుకుంటోందని ప్రశ్నించారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని మేడిగడ్డ బ్యారేజ్ సందర్శనకు వెళ్లినప్పుడు పోలీసులు అడ్డుకోవడం విచిత్రంగా ఉందన్నారు. బ్యారేజి డామేజ్ అయిందని మీడియా ద్వారా తెలుసుకుని, చూసేందుకు వెళితే ప్రభుత్వం అడ్డుకోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. రెండేళ్ల క్రితం వచ్చిన వరదల్లో కన్నెపల్లి పంప్ హౌజ్ మొత్తం మునిగిపోయినప్పుడు కూడా ఇదే పద్ధతితో వ్యవహరించారని గుర్తు చేశారు. ఇప్పుడే అదే విధానంతో ప్రభుత్వం నియంతలా వ్యవహరిస్తోందని దుయ్యబట్టారు. రాష్ట్ర ప్రభుత్వం కావాలనే బ్యారేజ్ నిర్మాణంలో జరిగిన డొల్లతనం బయటపడవద్దని కుట్ర చేస్తోందని జోజిరెడ్డి ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతి అక్రమాలపై సిబిఐ దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో జరిగిన అవినీతి, అక్రమాలపై ఎందుకు విచారణ చేపట్టడం లేదని ప్రశ్నించారు.ప్రజలను కాపాడేందుకు కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని నీటిని ఖాళీ చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు చేసి ప్రజల అనుమానాలను నివృత్తి చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

## కేసీఆర్‌పై ఉన్న అభిమానాన్ని బతుకమ్మ రూపంలో



ఎలిగేడు, అక్టోబర్ 22, (మనం న్యూస్) : ఎలిగేడు మండలం లాలపల్లి గ్రామంలో ఆదివారం సద్దుల బతుకమ్మ సందర్భంగా కళ్లెం శ్రీనివాసరెడ్డి కేసీఆర్‌పై ఉన్న మమకారాన్ని బతుకమ్మ రూపంలో వివరించారు. ప్రజలకు ఇన్ని రకాలుగా పథకాలను సేవల రూపంలో అందిస్తున్న సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి చొరవతో అభివృద్ధి పథకంలోకి నడిపిస్తుందని వివరించారు. మళ్లీ ప్రజలు కేసీఆర్ ప్రభుత్వానికి పట్టం కడతారని ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డిని ఆదరించి దీవిస్తారని పేర్కొన్నారు.

## బతుకమ్మ..బతుకమ్మ..ఉయ్యాలో .. బంగారు బతుకమ్మ ఉయ్యాలో

- సుల్తానాబాద్‌లో ఘనంగా సద్దుల బతుకమ్మ వేడుకలు



సుల్తానాబాద్, అక్టోబర్ 22, (మనం న్యూస్) : తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబించే పూల పండుగ సద్దుల బతుకమ్మ పండుగను సుల్తానాబాద్ మండలంలోని మహిళలు అంగరంగ వైభవంగా జరుపుకున్నారు. పూలతో దేవుళ్ళను పూజించే సంస్కృతి తెలంగాణ ఆడపడుచులు బతుకమ్మను ఆరాధిస్తారు. తీరొక్క పూలతో రంగు రంగులతో అలంకరించిన బతుకమ్మలను పేర్చి లక్ష్మీదేవి గౌరమ్మను పూజించి ఆడి పాడారు. మహిళలు, చిన్నారులు డిజే పాటలతో, కొలాటాలతో బతుకమ్మ..బతుకమ్మ..ఉయ్యాలో.. బంగారు బతుకమ్మ ఉయ్యాలో.. అంటూ ఆడుతూ పాడుతూ ఉల్లాసంగా బతుకమ్మ వేడుకలను జరుపుకున్నారు. బతుకమ్మలను నెత్తిన ఎత్తుకున్న చిన్నారులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. పట్టణంలోని అన్ని వార్డులల్లో రంగు రంగుల విద్యుత్ దీపాలతో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని పెద్ద చెరువులో, వెళ్ళిరా‘‘..బతుకమ్మ తల్లి అంటూ..’’బతుకమ్మల నిమజ్జనం చేసిన మహిళలు ఒకరికొకరు వాయినాలు ఇచ్చిపుచ్చుకున్నారు.

## అంబేద్కర్ సేన వరల్డ్ ఆర్గనైజేషన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీగా అపర్ణ



కరీంనగర్ కలెక్టరేట్, అక్టోబర్ 22, (మనం న్యూస్): అంబేద్కర్ సేన వరల్డ్ ఆర్గనైజేషన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీగా కరీంనగర్‌కు చెందిన జంగ అపర్ణను నియమిస్తున్నట్లు సంస్థ ఆలిండియా సెక్రటరీ రెడ్డిమల్ల శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆమెకు నియామక పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా అపర్ణ మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయాలకనుగుణంగా ప్రజా సంక్షేమం కోసం కృషి చేస్తానని చెప్పారు. తనకు అవకాశమిచ్చిన సంస్థ ఆలిండియా సెక్రటరీ రెడ్డిమల్ల శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

# సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి

- శాంతియుతంగా ఎన్నికలు జరిగేలా ప్రజలు సహకరించాలి
- ఎస్పీ సురేష్‌కుమార్

కొమురంభీం ఆసిఫాబాద్, అక్టోబర్ 22, (మనం న్యూస్): రాబోయే శాసనసభ ఎన్నికల సందర్భంగా ఎలాంటి వర్గ బేధాలు లేకుండా అల్లర్లు జరుగకుండా ప్రజలంతా సహకరించాలని జిల్లా ఎస్పీ కె సురేష్ కుమార్ అన్నారు. ఆదివారం స్థానిక ఎన్టీఆర్ చౌక్ వద్ద పారా మిలిటరీ దళాల ఫ్లాగ్ మార్చ్‌ను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా పారా మిలిటరీ దళాలతో కలిసి పట్టణంలోని లారీ చౌక్,రాజీవ్ గాంధీ చౌక్, మార్కెట్ ఏరియా వీధుల గుండా నిర్వహించిన కవాతులో పాల్గొన్నారు. అనంతరం దళాల కోసం ఏర్పాటు చేసిన సదుపాయాలను పరిశీలించి వారికి ఎన్నికలకు సంబంధించి తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఎలక్షన్ కమిషన్ సూచించిన నిబంధనల ప్రకారం విధులు నిర్వహించాలని, రాబోయే శాసనసభ ఎన్నికల సందర్భంగా ఇప్పటి నుండే సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. జిల్లాలో మొత్తం 597 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఎవరైనా చట్ట విరుద్ధంగా ప్రవర్తించిన, గొడవలు సృష్టించాలని చూసిన వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుంది అని హెచ్చరించారు. గ్రామంలోని ప్రజలంతా ఎలాంటి గొడవలు లేకుండా ప్రశాంతంగా ఉన్నప్పుడే గ్రామము, జిల్లా అభివృద్ధి చెందుతుందని కావున ప్రజలంతా వర్గ బేధాలు లేకుండా శాంతియుతంగా ఎన్నికలు జరిగేలా సహకరించాలని ఒకరికి ఒకరు కలిసి మెలిసి సామరస్యంగా ఉండాలని తెలిపారు. ప్రజలంతా ఎలక్షన్ సమయంలో పోలీసు వారికి సహకరించాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కాగజ్ నగర్ డిఎస్పీ కరుణాకర్, సీఐలు స్వామి, నాగరాజు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

# మంథని పురవీధుల గుండా అమ్మవారి ఊరేగింపు

- నృత్యాలు కోలాటాల భజన
- పాటలతో హోరెత్తించిన భక్తులు



మంథని, అక్టోబర్ 22, (మనం న్యూస్) : దేవీ నవరాత్రులను పురస్కరించుకొని ఏడవరోజు శ్రీ దుర్గా మాత పుట్టినరోజు సందర్భంగా ఆదివారం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని మంథని పురవీధుల గుండా ఘనంగా ఊరేగించారు. ఈ సందర్భంగా రావుల చెరువు కట్టలోని శ్రీ మహాలక్ష్మీ అమ్మవారి దేవాలయం నుండి ఊరేగింపు ప్రారంభమైంది. పట్టణంలోని మందాట, తమ్మిచెరువు కట్ట, పెంజేరు కట్ట, నడివీధిలోని శ్రీ లక్ష్మీ నారాయణ స్వామి దేవాలయం వద్ద గోపాల కాలువలు ఉట్టి పగలకొట్టారు. ఈ ఊరేగింపులో చిన్న పిల్లల నుండి పెద్ద వాళ్లదాకా నృత్యాలు చేస్తూ కోలాటం చేశారు. భజనలు చేస్తూ ఊరేగించిన అమ్మవారికి ప్రతి ఇంటి ముందు అమ్మవారికి మంగళ హారతులు ఇచ్చారు. ముచ్చట గొలిపిన చక్రి భజన దేవి నవరాత్రుల సందర్భంగా శ్రీ మహాలక్ష్మీ దేవాలయంలో మొదటి రోజు నుంచి నరవధికంగా నిర్వహించిన ఎక్కహం భజన కార్యక్రమం నిర్వహించారు. ముగింపు సందర్భంగా ఆదివారం రాత్రి మూడు గంటల పాటు జరిగిన ఈ భజన కార్యక్రమంలో పట్టణంలోని అన్ని వాడాలకు చెందిన భజనపరులు భక్తి పాటలతో అందరిని రక్షింప చేశారు.

## బిఆర్ఎస్‌లో చేరికలు



మంచిర్యాల, అక్టోబర్ 22, (మనం న్యూస్): మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలం ముల్కల్ల పార్టీలకు చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆదివారం ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు సమక్షంలో బిఆర్ఎస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ముల్కల్ల గ్రామంలోని వివిధ పార్టీలకు చెందిన మాజీ సర్పంచ్ బేర ప్రభాకర్,మాజీ వార్డు సభ్యులు జువ్వి కిషన్ ,కాంగ్రెస్ పార్టీ యువజన నాయకులు రామటెంకి మల్లేష్, శ్రీకాంత్, సాయితో పాటు వారి అనుచరులు 15 మంది మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే నివాసంలో బిఆర్ఎస్ పార్టీలో చేరగా వారికి దివాకర్ రావు గులాబీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా దివాకర్ రావు మాట్లాడుతూ రాష్ట్రంలో సిఎం కెసిఆర్ నేతృత్వంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలే బిఆర్ఎస్ పార్టీ విజయ సోపానాలని, బిఆర్ఎస్ హయాంలో జరిగిన అభివృద్ధి చూసి పార్టీలోకి వలసలు పెరిగాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముల్కల్ల సర్పంచు మంచాల శ్రీనివాస్, ఎంపీటీసీ సభ్యులు గడ్డం లతశ్రీ తిరుపతి, ఉప సర్పంచ్ వెంకటేష్, బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు మొగిలి శ్రీనివాస్, యూత్ అధ్యక్షులు దొమ్మటి బాపన్న,కర్ణమామిడి సింగిల్ విండో చైర్మన్ కోట సత్తయ్య,ఉప సర్పంచు చెల్ల వెంకటేష్, నాయకులు అసాది సుధాకర్, రావుల వెంకటేష్, మాజీ ఎంపీటీసీ కొట్టే సత్యం కూడక సత్యం, కిరీటి ముఖ్య నాయకులు ,తదితరులు పాల్గొన్నారు.

## సోమారపు సత్యనారాయణ ముఖ్య కార్యకర్తల సమావేశం



గోదావరిఖని, అక్టోబర్ 22, (మనం న్యూస్): మాజీ ఎమ్మెల్యే, మాజీ ఆర్టీసీ చైర్మన్ సోమారపు సత్యనారాయణ ఆదివారం రామగుండం నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. గోదావరిఖని గౌతమ్ నగర్‌లోని శివ గార్డెన్ లో నిర్వహించిన ఈ సమావేశంలో సత్యనారాయణ మాట్లాడుతూ అన్ని డివిజన్ లో తమకు బలమైన కార్యకర్తలున్నారని, రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలవడానికి ముఖ్య కారణం డివిజన్‌లో ఉన్న ముఖ్య కార్యకర్తలన్నారు. బూత్ స్థాయి నుంచి కష్టపడి పనిచేయడం ద్వారా మనం గతంలో చేసిన అభివృద్ధి ఇంటి ఇంటికి ఏవిధంగా తీసుకెళ్ళాలి, ఇప్పుడు ఉన్న నాయకుల పాలన వలన రామగుండం అభివృద్ధిలో వెనక బడటానికి గల కారణాలను ప్రజలలోకి తీసుకెళ్లాలన్నారు. ఎమ్మెల్యేగా రామగుండం ప్రజలు ఎన్నుకుంటే ఏ విధంగా అభివృద్ధి సాధిస్తాం, అనే విషయాలు ప్రతి ఓటరుకి ఏవిధంగా తెలిపాలని, ఎలక్షన్‌లో ఏవిధంగా ముందుకు వెళ్లాలో దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ రాజమణి, సోమారపు అరుణ్, లావణ్య, కుసుమ, వుడ్లూరి రవి, పిడుగు కృష్ణ, కొండాటి ప్రవీణ్, చంద్రశేకర్ గౌడ్, డేవిడ్, రాయాలింగు, కమలు గౌడ్, బండారి రాయమల్లు, వీరన్న, సత్యం, సురేష్, నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# చల్మెడ సమక్షంలో బిఆర్ఎస్‌లో చేరిన యువకులు



వేములవాడ, అక్టోబర్ 22, (మనం న్యూస్): వేములవాడ అసెంబ్లీ నియోజకవర్గంలోని కథలపూర్ మండలం దూలూరు గ్రామానికి చెందిన సుమారు 50మంది యువకులు ఆదివారం బిఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ అభ్యర్థి చల్మెడ లక్ష్మి నరసింహారావు వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం చల్మెడ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో మూడవ సారి అధికారం సాధించేది బిఆర్ఎస్ ప్రభుత్వమేనన్నారు. ప్రతి ఒక్కరూ పార్టీ గెలుపు కోసం కృషి చేయాలని కోరారు. మన ప్రాంత అభివద్ధి కోసం వేములవాడ లో గులాబీ జెండా ఎగురవేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మార్క్ ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపు రెడ్డి, జడ్పీటీసీ నాగం భూమయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ సౌజన్య-గంగాధర్, ప్యాక్స్ వైస్ చైర్మన్ మిట్టపల్లి లక్ష్మి-గంగారెడ్డి, ఎంపిటిసి లక్ష్మి-నాగరాజు, పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు జూపాక మహేష్, నాయకులు మిర్యాల వెంకటేశ్వరరావు, మేడిపల్లి రాజిరెడ్డిలతో పాటు పెద్ద ఎత్తున యువకులు పాల్గొన్నారు.

## నియోజకవర్గానికి చేరిన ఈవీఎం యంత్రాలు

- అర్హులైన ఓటర్లు ఎన్నికల ప్రక్రియను విజయవంతం చేయాలి
- మంథని ఆర్డీవో హనుమ నాయక్



మంథని, అక్టోబర్ 22, (మనం న్యూస్) : మంథని అసెంబ్లీ నియోజకవర్గానికి జిల్లా కేంద్రం నుండి ఎన్నికలకు సరిపడా ఈవీఎం యంత్రాలు జేఎన్టీయూహెచ్ కాలేజీకి చేరుకున్నాయని మంథని ఆర్డీవో హనుమ నాయక్ ఆదివారం తెలిపారు. వచ్చే ఎన్నికలు శాంతియుతంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించినట్లు ఆయన పేర్కొన్నారు. అర్హులైన ఓటర్లందరూ ఎన్నికల్లో పాల్గొని ఎన్నికల ప్రక్రియను విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈవీఎం భద్రత కోంస 24 గంటలు పోలీస్ పారాను ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఈవీఎం తరలింపు కార్యక్రమంలో మంథని తహసీల్దార్ రాజయ్య, కమాన్‌పూర్, ముత్తారం, రామగిరి, తహసీల్దార్లుతో పాటు బిఆర్ఎస్, కాంగ్రెస్, బిజెపి పార్టీల నియోజకవర్గ బాధ్యులు పాల్గొన్నారని తెలిపారు.

## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థినికి ఆర్థిక సహాయం




వేములవాడ, అక్టోబర్ 22, (మనం న్యూస్): వేములవాడ పట్టణంలోని కుమ్మరి వీధికి చెందిన గోగికార్ శివాని అనే పేద విద్యార్థిని ఉన్నత చదువుల కోసం లయన్స్ క్లబ్ సభ్యులు 30 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా అదివారం లయన్స్ క్లబ్ అధ్యక్షులు, కౌన్సిలర్ మారం కుమార్ అధ్వర్యంలో సభ్యులు విద్యార్థిని ఇంటికి వెళ్ళి నగదును అందజేసి అండగా నిలిచారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిరుపేద కుటుంబానికి చెందిన శివాని ఢీ ఫార్మసీ ఉన్నత చదువుల కోసం ఆర్థిక ఇబ్బందులు పడుతుందని తమ దృష్టికి వచ్చిందన్నారు. విషయం తెలిసిన వెంటనే విద్యార్థినికి ఆర్థిక సహాయం అందించామని తెలిపారు. నిరుపేద విద్యార్థిని, విద్యార్థులకు లయన్స్ క్లబ్ ద్వారా ఎల్లవేళలా ఆర్థిక సహాయ, సహకారాలు అందజేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్యాబినెట్ మెంబర్ శ్రీనివాస్, తీగల వెంకటేశ్వర రావు, ఉపాధ్యక్షులు వంగపల్లి ప్రశాంత్, వరాల వెంకట కృష్ణ, శివాని బంధువులు పాల్గొన్నారు.



కరీంనగర్ జిల్లాలో వైభవంగా జరిగిన బతుకమ్మ వేడుకలు, పాల్గొన్న మంత్రి గంగుల కమలాకర్, కరీంనగర్ మేయర్ సునీల్‌రావు తదితరులు

# బీఆర్ఎస్ నుండి కాంగ్రెస్‌లోకి చేరికలు

- వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీదే గెలుపు
- గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూముకుం నర్సారెడ్డి





జగదేవ్‌పూర్, అక్టోబర్ 22, మనం న్యూస్: ప్రజా సంక్షేమం, గజ్వేల్ నియోజకవర్గ అభివృద్ధి కేవలం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని, బిఆర్ఎస్ చేస్తున్న అవినీతి పాలనతో విసుగుచెందిన నేతలు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూముకుంట నర్సారెడ్డి అన్నారు. ఆదివారం గజ్వేల్ మండలంలోని పలుగుగడ్డ గ్రామ యువకులు మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి ఆధ్వర్యంలో బిఆర్ఎస్ పార్టీ నుండి కాంగ్రెస్ పార్టలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాలు, పేద ప్రజలు అభివృద్ధి చెందాలన్నా, ఆర్థికంగా ఎదగాలన్నా అది కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమన్నారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో ప్రకటించిన మేనిఫెస్టోకు ఆకర్షితులై యువకలు స్వచ్ఛందంగా బిఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్ పార్టీలోకి చేరుతున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో బిఆర్ఎస్ ఓటమి ఖాయమని, గజ్వేల్‌తోపాటు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులురవిందర్ రెడ్డి, పిఎసిఎస్ మాజీ ఛైర్మన్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు నరేందర్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ అధ్యక్షులు శ్రవణ్ కుమార్, గొల్లపల్లి ఎంపిటిసి మహేష్, పీర్లపల్లి ఎంపిటిసి మహేందర్‌రెడ్డి, కొండపోచమ్మ ఆలయ మాజీ ఛైర్మన్ మల్లేశం, బంగార్‌రెడ్డితోపాటు తదితరులు పాల్గొన్నారు.

## పారిశుధ్య కార్మికుల సేవలు ఎనలేనివి

- సఫాయి కార్మికులకు చీరలు పంపిణీ చేసిన సర్పంచ్



మిరుదొడ్డి, అక్టోబర్ 22, మనం న్యూస్: పారిశుధ్య కార్మికు సేవలు ఎనలేనివని మిరుదొడ్డి సర్పంచ్ రంగనవైున రాములు అన్నారు. ఆదివారం మిరుదొడ్డి మండల కేంద్రంలో సర్పంచ్ భార్య శోభ జ్ఞాపకార్థం సఫాయి కార్మికులకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాన్ని నిత్యం పరిశుభ్రంగా ఉంచడంలో సఫాయి కార్మికుల సేవలు చాలా గొప్పవి అన్నారు. బతుకమ్మ పండుగకు వారికి చిరుకానుకగా చీరలు అందించడం జరిగిందన్నారు.

## బీజేపి అడ్డాగా మారనున్న దుబ్బాక

- బీజేపిలో చేరిన కురుమ సంఘం నాయకులు



మిరుదొడ్డి, అక్టోబర్ 22, మనం న్యూస్: దుబ్బాక గడ్డ బీజేపికి అడ్డాగా మారబోతుందని దుబ్బాక శాసనసభ్యులు రఘునందన్‌రావు అన్నారు. ఆదివారం మిరుదొడ్డి మండల పరిధిలోని ధర్మారం గ్రామంలో అమ్మవార్లను ఆయన దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ధర్మారం గ్రామ కురుమ సంఘం నాయకులు సుమారు 30 మంది బీజేపి పార్టీలో చేరడంతో వారికి పార్టీ కండువా కప్పి వారిని పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుర్గామాత ఇచ్చిన దైవ శక్తితో దుబ్బాక గడ్డ బీజేపి అడ్డాగా మారడం ఖాయమన్నారు. తాను ఎమ్మెల్యేగా గెలిచినప్పటి నుండి నియోజకవర్గంలోని పెండింగ్ పనులన్నీ పూర్తయ్యాయని, ప్రజలిచ్చిన మనోధైర్యంతోనే అసెంబ్లీలో దుబ్బాక సమస్యలపై విన్నపించడం జరుగుతుందన్నారు. గత తొమ్మిదేళ్లుగా అధికారంలో ఉన్న వ్యక్తికి నియోజకవర్గంలో ఓట్లడిగే నైతిక హక్కు కూడా లేదన్నారు. చేరిన వారిలో కురుమ సంఘం నాయకులు యాదగిరి, బాలమల్లు, మనోహర్, పర్శరాములు, యాదగిరి, పర్శరాములు, రాములు, రాజలింగం, దేవయ్య, మల్లేశంతోపాటు తదితరులు చేరారు.

## బీజేపి తొలి జాబితాలో రఘునందన్ రావు అభ్యర్థిత్వం ఖరారు

- దుబ్బాకలో బీజేపిదే విజయమంటూ బీజేపి నాయకుల సంబరాలు



మిరుదొడ్డి, అక్టోబర్ 22, మనం న్యూస్: 2023 రాష్ట్ర ఎన్నికల నేపథ్యంలో బీజేపి తొలి జాబితాలో దుబ్బాక బీజేపి అభ్యర్థిగా రఘునందన్‌రావును కేటాయించిన సందర్భంగా మిరుదొడ్డి, అక్బర్‌పేట మండల కేంద్రాల్లో ఆదివారం టాపాకాయలు కాల్చి మిఠాయిలు పంచుకున్నారు. ఈ సందర్భంగా మిరుదొడ్డి మండల పార్టీ అధ్యక్షులు దేవరాజు, అక్బర్‌పేట భూంపల్లి అధ్యక్షులు అరిగె కృష్ణలు మాట్లాడుతూ రఘునందన్‌రావుకు భారతీయ జనతా పార్టీ టికెట్ కేటాయించడంతో రఘునందన్‌రావు గెలుపు ఖాయమైందన్నారు. కార్యకర్తలంతా ప్రతి గ్రామంలో సమిష్టిగా పని చేసి ఎమ్మెల్యే అభ్యర్థి రఘునందన్‌రావుకు భారీ మెజార్టీ వచ్చే విధంగా పని చేయాలని సూచించారు. దుబ్బాక నియోజకవర్గంలో ఇప్పటికే కాంగ్రెస్, బిఆర్ఎస్ నాయకులకు వణుకు పుట్టుకుందన్నారు. డిసెంబర్ 3న ఇంతకు పై ఎత్తు ఉత్సాహంతో విజయోత్సవ ర్యాలీ తీయడం జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో బీజేపి నాయకులు మల్లేశం, తోకల శ్రీనివాస్‌రెడ్డి, మంగలి సాయిలు, భూపాల్, నర్సింలు, రవి, కొమురయ్య, కనకరాజు, నారాయణరెడ్డి, స్వామి, నందు, పర్శరాములు, అక్బర్‌పేట భూంపల్లి మండల బీజేపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## అమ్మవారికి రుద్ర హోమం, మహాపూర్ణాహుతి పూజ



కొమురవెల్లి, అక్టోబర్ 22, మనం న్యూస్: శ్రీ దేవి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మల్లన్న ఆలయంలో రుద్ర హోమం, మహాగణపతి పూజ, పంచచర్య పూజ, గౌరీ పూజ, నవగ్రహ ప్రధాన కలశారాధన, మండపారాధన, సుహాసినీ పూజ, హోమం, నవగ్రహ హోమం, మూలమంత్ర మహా చండీ హోమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారి ఈఓ బాలాజీ, సహాయ అధికారి వైరాగ్యం అంజయ్య, సూపరిండెంట్ నీల శేఖర్, ప్రధానార్చకులు మహదేవుని మల్లికార్జున్, అర్చకులు మహదేవుని రవి దంపతులు, అర్చకులు పడిగన్నగారి అంజయ్య, ఆకుల విజయ్‌కుమార్, మల్లికార్జున్, వేద పండితులు తదితరులు పాల్గొన్నారు.

## గజ్వేల్ గడ్డపై బీజేపి జెండా ఎగరడం ఖాయం

- ఈటల పోటీతో కేసీఆర్‌లో వణుకు
- సంబరాలు నిర్వహించుకున్న బీజేపి నాయకులు



గజ్వేల్, అక్టోబర్ 22, మనం న్యూస్: త్వరలో జరగనున్న సాధారణ ఎన్నికల్లో గజ్వేల్ గడ్డపై ఈసారి బీజేపి జెండా ఎగరడం ఖాయమని బీజేపి నాయకులు పేర్కొన్నారు. ఆదివారం రోజున బీజేపి పార్టీ ప్రకటించిన తొలి జాబితాలో గజ్వేల్ బీజేపి అభ్యర్థిగా ఈటల రాజేందర్ పేరును ప్రకటించడం పట్ల స్థానిక ఇందిరా పార్కు చౌరస్తా వద్ద బీజేపి నాయకులు, కార్యకర్తలు టపాకాయలు కాల్చి సంబరాలు జరుపుకుని మిఠాయిలు పంచుకుని సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా బీజేపి నియోజకవర్గ నాయకులు బండారు మహేష్ మాట్లాడుతూ గజ్వేల్ ఎమ్మెల్యే అభ్యర్థిగా ఈటల రాజేందర్‌ను ప్రకటించడం హర్షించదగ్గ విషయమని, దీంతో సీఎం కేసీఆర్‌లో వణుకు పుడుతుందన్నారు. కేసీఆర్‌కు ధీటైన వ్యక్తి కేవలం ఈటల రాజేందర్ మాత్రమే అని, ఈసారి గజ్వేల్‌లో బీఆర్ఎస్ ఓటమి ఖాయమని, కేసీఆర్ ఈటల రాజేందర్ చేతిలో ఓడించడానికి నియోజకవర్గ ప్రజలంతా ఎదురు చూస్తున్నారన్నారు. ఈటల ఇచ్చిన మాట ప్రకారమే కేసీఆర్‌పై పోటీ చేయడం పట్ల కేసీఆర్‌కు ఈటల భయం పట్టుకుంటుందన్నారు. కేసీఆర్ ఈటల భయంతో కార్యకర్తలతో ఇకపై నెలకొక రోజు నియోజకవర్గంలోనే ఉంటానని చెప్పడం సిగ్గుచేటన్నారు. నెలకో రోజు కాదు ఎన్నికల సమయమైన 40 రోజుల పాటు గజ్వేల్‌లోనే కేసీఆర్ టెంట్ వేసుకొని కూర్చున్నా ఎన్ని కోట్లు ఖర్చు పెట్టినా గెలిచే ప్రసక్తే లేదన్నారు. ఖచ్చితంగా గజ్వేల్ గడ్డమీద బీజేపి జెండా ఎగరడం ఖాయమన్నారు. గజ్వేల్ ప్రజలు చైతన్యం కలిగిన వారని, ఈసారి కేసీఆర్‌కు ప్రజలు తగిన గుణపాఠం చెప్తారన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు ఎల్లు రాంరెడ్డి, బీజేపి జిల్లా ఉపాధ్యక్షులు పేర్ల శ్రీనివాస్, పట్టణ అధ్యక్షులు ఉప్పల మధుసూదన్, మండల అధ్యక్షులు పంజాల అశోక్ గౌడ్, ప్రధాన కార్యదర్శులు పెండాల శ్రీనివాస్, పంజాల వెంకటేష్ గౌడ్, నాయకులు సిల్వర్‌జనార్ధన్, మర్కంటి, ఏగొండ స్వామి, ఆనంద్ గౌడ్, నవీన్, సందీప్, కష్టమైన సందీప్, ప్రశాంత్, రాజు, సంతోష్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## బీజేపి కార్యకర్తల సంబరాలు

- బీజేపి నుండి గజ్వేల్‌లో ఈటల అభ్యర్థిత్వం పట్ల సంబరాలు



కొండపాక, అక్టోబర్ 22, మనం న్యూస్: గజ్వేల్ నియోజకవర్గ భారతీయ జనతా పార్టీ అభ్యర్థిగా ఈటల రాజేందర్‌కు టికెట్ కేటాయించడంతో బీజేపి కార్యకర్తలు ఆదివారం సంబరాలు జరుపుకున్నారు. దుద్దెడ రాజీవ్ రహదారిపై మండల పార్టీ అధ్యక్షులు శశిధర్‌రెడ్డి ఆధ్వర్యంలో టపాకాయలు కాల్చి మిఠాయిలు తినిపించుకొని సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈటల రాజేందర్ పోటీ చేయడాన్ని తాము స్వాగతిస్తున్నామని, కేసీఆర్‌పై ఈటల రాజేందర్ గెలవడం ఖాయమన్నారు. గజ్వేల్ ప్రజలు ఈసారి మార్పు కోరుకుంటున్నారని, గజ్వేల్‌లో ఈసారి ఎన్నికల్లో బీజేపి జెండా ఎగరడం తథ్యమన్నారు.

## సంఘసేవకురాలిని కించపరిచిన వ్యక్తిని అరెస్ట్ చేయాలి

- ముస్లిం మైనార్టీ, ప్రజా సంఘాల డిమాండ్



దౌల్తాబాద్, అక్టోబర్ 22, మనం న్యూస్: ముస్లిం మైనార్టీ వర్గానికి చెందిన ప్రముఖ సంఘ సేవకురాలిపై సోషల్ మీడియాలో అసభ్యకరంగా కామెంట్ చేసిన బీజేపి కిసాన్‌మోర్చ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తిండ్ల సత్యంను అరెస్ట్ చేయడంలో పోలీసులు నిర్లక్ష్యం వహించడం తగదని మైనార్టీ, దళిత బహుజన ప్రజా సంఘాలు మండిపడ్డారు. ఆదివారం దౌల్తాబాద్ ప్రెస్‌క్లబ్‌లో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాల జేఏసి రాష్ట్ర ఉపాధ్యక్షులు కరికె శ్రీనివాస్, జిల్లా కో ఆప్షన్ సభ్యులు రహీమొద్దీన్, ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ డప్పు శివరాజ్, జాతీయ మాలమహానాడు రాష్ట్ర నాయకులు తుమ్మ శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా నిరుపేద ప్రజలకు, అనాథలకు, పేద కుటుంబాలకు సేవ చేస్తున్న సంఘసేవకురాలిని అవమానించడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అలాటి వ్యక్తులకు ఎమ్మెల్యే రక్షణ కల్పించడం సమంజసం కాదన్నారు. మహిళల పట్ల బీజేపి పార్టీకి చిత్తశుద్ధి ఇదేనా అని ప్రశ్నించారు. సత్యంను వెంటనే బీజేపి పార్టీ నుండి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో సంయమనం పాటించాల్సింది పోయి కుల, మత విద్వేషాలను రెచ్చగొట్టడం తగదన్నారు. నిందితడు సత్యంను పోలీసులు వెంటనే అరెస్ట్ చేసి చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో దౌల్తాబాద్, రాయపోల్, తొగుటకో ఆప్షన్ సభ్యులు అహ్మద్, పర్వేజ్, కలీమొద్దీన్, ర్యాకం శ్రీరాములు, నాగరాజుతోపాటు తదితరులు పాల్గొన్నారు.

## అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టివేత



కొండపాక, అక్టోబర్ 22, మనం న్యూస్: కుకునూరుపల్లి మండలం చిన్నకిష్టాపూర్ నుండి అక్రమంగా వ్యాన్‌లో తరలిస్తున్న పిడిఎస్ బియ్యాన్ని కుకునూరుపల్లి పోలీసులు ఆదివారం పట్టుకున్నారు. వివిధ గ్రామాల నుండి రేషన్ బియ్యం సేకరించి చిన్నకిష్టాపూర్ గ్రామం నుండి డిసియం వ్యాన్‌లో తరలిస్తుండగా పోలీసుల తనిఖీల్లో పట్టుబడ్డాయి. సుమారు 80 నుండి 100 సంచుల వరకు బియ్యం ఉన్నట్లు పోలీసులు తెలిపారు. బియ్యం తరలిస్తున్న వాహనాన్ని పోలీస్ స్టేషన్‌కు తరలించి సీజ్ చేశారు. సమాచారాన్ని సివిల్ సప్లై అధికారులకు అందించినట్లు ఎస్ఐ పుష్పరాజ్ తెలిపారు.

## దుర్గమ్మ ఆలయంలో ‘ఉర్వి’ సినిమా టీజర్ విడుదల



దౌల్తాబాద్, అక్టోబర్ 22, మనం న్యూస్: దౌల్తాబాద్ మండల కేంద్రానికి చెందిన అల్వాల రాజు రాసిన కథ ఆధారంగా రూపొందించిన ఉర్వి సినిమా టీజర్‌ను ఆదివారం రోజున దౌల్తాబాద్‌లోని దుర్గమ్మ ఆలయం వద్ద విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సయ్యద్ కలీలొద్దీన్, గొల్ల శేఖర్, తుమ్మల లాల్‌బాబు, అల్వాల రాజమల్లయ్య, వంశీ, సత్యం, పోషయ్య, బాబు, నరేష్, స్వామి, రాజవేఖర్, గణేష్, ప్రవీణ్, మధు తదితరులు హాజరై అమ్మవారిని దర్శించుకొని సినిమా పోస్టర్ ఆవిష్కరించి టీజర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజు ఈ ఒక్క సినిమాతోనే ఆగిపోకుండా మున్ముందు మరిన్ని సినిమాలకు రచయితగా ఉండాలని ఆకాంక్షించారు. రాజుకు ఆర్థికంగా సహకరించిన సయ్యద్ ఖలీలుద్దీన్‌కు ధన్యవాదాలు తెలిపారు. సినిమా డిసెంబర్ మాసం చివరి వారంలో ప్రేక్షకుల ముందుకు రానుందని, కావున ప్రేక్షకులందరూ థియేటర్లలో సినిమాను చూసి ఆదరించి విజయవంతం చేయాలని కోరారు.

## కొనసాగుతున్న దేవి నవరాత్రి ఉత్సవాలు



మిరుదొడ్డి, అక్టోబర్ 22, మనం న్యూస్: అక్బర్‌పేట భూంపల్లి మండల పరిధిలోని వీరారెడ్డిపల్లి గ్రామంలో ఎనిమిదవ రోజు దేవి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. నిత్యం అమ్మవారిని ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చేలా వివిధ రకాల పూజలు నిర్వహిస్తూ భక్తుల ద్వారా అమ్మవారికి ఘనమైన పూజలు నిర్వహిస్తున్నారు నిర్వాహకులు. నవరాత్రుల పాటు పూజలందుకున్న అమ్మవారు నేడు సోమవారంతో నవరాత్రులు ముగించుకొని నిమజ్జనానికి బయల్దేరుతారని నిర్వాహకులు తెలిపారు. ఈ తొమ్మిది రోజులు అమ్మవారిని తీరొక్క అలంకరణలో పూజించి నిత్యం వేద బ్రాహ్మణోత్తములచే పూజలు జరిపారు. అదేవిధంగా దుర్గామాత వద్ద భజన మండలి సభ్యులతో భజన కార్యక్రమాలు నిర్వహించారు. కచేరి వద్ద ఏర్పాటు చేసిన అమ్మవారి వద్ద మహిళలు కుంకుమార్చనతో, హోమంతో నిత్యం రకారకాలు పూజలు నిర్వహించి అమ్మవారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారన్నారు.

## కొనసాగుతున్న దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు



కొండపాక, అక్టోబర్ 22, మనం న్యూస్: మండలంలోని వివిధ గ్రామాల్లో నెలకొల్పిన దుర్గామాత మంటపాల వద్ద నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ప్రతి రోజు ప్త్యేక పూజలతోపాటు వివిధ మండపాలలో అన్నప్రసాద వితరణ కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు. భక్తిశ్రద్ధలతో భక్తులు ఉపవాస దీక్ష కొనసాగిస్తూ దీక్షతో భక్తిశ్రద్ధలతో పూజాదికార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. సాయంత్రం వేళలో మంగళహారతులు, భజన కీర్తనలతో మంటపాల్లో భక్తులు భక్తిపారవశ్యంతో పొంగిపోతున్నారు. మండల పరిధిలోని దుద్దెడ గ్రామంలో చైతన్య యూత్ ఆధ్వర్యంలో నెలకొల్పిన దుర్గామాత మండపం వద్ద గ్రామానికి చెందిన ఊసకొయ్య పాండు దంపతులు అన్నప్రసాద వితరణ నిర్వహించారు.

## అతివేగంగా వచ్చి బైక్‌ను ఢీకొన్న కారు

- తీవ్రగాయాలతో యువకుడి మృతి



దుబ్బాక టౌన్, అక్టోబర్ 22, మనం న్యూస్: అతివేగంగా వచ్చిన వాహనం బైక్‌ను ఢీ కొనడంతో బైక్‌పై ఉన్న యువకుడు తీవ్ర గాయాలతో మృతి చెందిన సంఘటన దుబ్బాక మండల పరిధిలోని రాజక్కపేట శివారులో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం దుబ్బాక మండలం రాజక్కపేట గ్రామానికి చెందిన ముదిగొండ భాస్కర్ (26) తన మోటార్ సైకిల్‌పై బతుకమ్మ పండుగ సందర్భంగా దుబ్బాక పట్టణంలో పూవులు తీసుకురావడానికి వస్తుండగా మార్గమధ్యంలో రాజక్కపేట శివారులోని మూలమలుపు వద్ద ఎదురుగా వస్తున్న ఎకో కారు డ్రైవర్ సూర్య అజాగ్రత్తగా అతివేగంగా వచ్చి ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీ కొట్టడంతో భాస్కర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. కాగా వెంటనే అతన్ని దుబ్బాక ప్రభుత్వాసుపత్రికి తరలించగా ఆసుపత్రిలో మరణించాడు. ఘటనపై మృతుని తండ్రి యాదగిరి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుడు ప్రస్తుతం హైదరాబాద్‌లోని ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడని, ఇంకా వివాహం జరగలేదని, పండగ పూట భాస్కర్ మృతి పట్ల గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

## తలకు గాయమై చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

దుబ్బాక, అక్టోబర్ 22, మనం న్యూస్: తలకు గాయమై చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటన దుబ్బాక మండలం శిలాజీనగర్ గ్రామంలో చోటు చేసుకుంది. శిలాజీనగర్‌కు చెందిన మదూరి మల్లయ్య ఈనెల 20వ తేదీన ఇంటి వెనుక ఉన్న మామిడి తోటలోకి వెళ్లి ప్రమాదవశాత్తు కాలుజారి కింద పడడంతో తలకు తీవ్ర గాయం కాగా మాట్లాడలేకపోయాడు. దీంతో దుబ్బాక ప్రభుత్వాసుపత్రికి తరలించగా వైద్యులు సిద్దిపేటకు రిఫర్ చేయగా సిద్దిపేట ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు మృతుని కుమారుడు మదూరి మహేందర్ తెలిపారు.

# ప్రపంచంలోనే అతి చిన్న పెన్సిల్ గ్రాఫైట్ బతుకమ్మ

కాటారం, అక్టోబర్ 22, మనం న్యూస్ : సద్దుల బతుకమ్మ పండుగను పురస్కరించుకుని కాటారం గిరిజన గురుకుల (బాలురు) - చిత్రకళా ఉపాధ్యాయుడు ఆడెపు రజనీకాంత్ పెన్సిల్ గ్రాఫైట్ పై 3 మిల్లీ మీటర్ల ఎత్తు 2 మిల్లీ మీటర్ల వెడల్పున్న ప్రపంచంలోనే అతి చిన్న పెన్సిల్ గ్రాఫైట్ బతుకమ్మను సుమారు 3 గంటల పాటు శ్రమించి తయారు చేశాడు. అదేవిధంగా తొమ్మిది రోజులపాటు జరుపుకునే బతుకమ్మ పండుగకు ప్రత్యేకంగా తొమ్మిది బతుకమ్మకులను చాక్ పీస్ లపై పెన్సిల్ గ్రాఫైట్ పెన్సిల్ ఉడ్‌పై, చైనా క్లేతో వివిధ ఎత్తులలో సుమారు 10 గంటలపాటు శ్రమించి తయారు చేశాడు. పెన్సిల్ గ్రాఫైట్ అతిచిన్న పరిమాణంలో తయారు చేయగా చాక్పెన్ పై 1.5 సెంటీ మీటర్ల ఎత్తు, 1 సెంటీమీటరు వెడల్పు, రెండవ బతుకమ్మలను 1.2 సెంటీమీటర్ల ఎత్తు 1 సెంటీమీటర్ వెడల్పు, 3వ బతుకమ్మను 1 సెంటీమీటర్ ఎత్తు 9 మిల్లీ మీటర్ల వెడల్పు, నాల్గవ బతుకమ్మను 8 మిల్లీమీటర్ల ఎత్తు 8 మిల్లీ మీటర్ల వెడల్పుతో 5 వ బతుకమ్మలను పెన్సిల్ ఉడ్ పై 3.8 సెంటీమీటర్ల ఎత్తు 6 మిల్లీమీటర్ల వెడల్పు, 6 వ బతుకమ్మను పెన్సిల్ గ్రాఫైట్స్ పై 1.3 సెంటీ మీటర్ల ఎత్తు, 2 మిల్లి మీటర్ల వెడల్పుతో, 7 వ బతుకమ్మను 5 మిల్లీ మీటర్ల ఎత్తు 6 మిల్లీ మీటర్ల వెడల్పుగల చాక్ పీస్ బతుకమ్మ, 8 వ బతుకమ్మను చాక్ పీస్‌పై 4.5 సెంటీమీటర్ల ఎత్తు 1 సెం మీ. వెడల్పు బతుకమ్మను ఎత్తుకున్న ఆడపడుచును, చివరగా 9వ బతుకమ్మను 3 మిల్లీ మీటర్ల ఎత్తు 2 మిల్లీ మీటర్ల వెడల్పు తో పెన్సిల్ ఫిట్ తయారు చేశాడు. తన సూక్ష్మ కళ ద్వారా తెలంగాణ ప్రజలందరికి శుభాకాంక్షలు తెలిపారు.





రజనీకాంత్ చిత్రకళ ను పలువురు అభినందిస్తున్నారు

## పల్లెల్లో ఘనంగా సద్దుల బతుకమ్మ సంబరాలు



వాజేడు, అక్టోబర్ 22, మనం న్యూస్ : ఎంగిలిపూల బతుకమ్మతో మొదలై తొమ్మిది రోజులు భక్తిశ్రద్ధలతో పూలను పూజిస్తూ బతకమ్మ, గౌరమ్మ, అంటూ తన ఇష్ట దైవాలతో పోల్చుకొని తొమ్మిది రోజులు తొమ్మిది రకాల బతుకమ్మను పేర్చి గౌరీ పూజలతో సద్దుల బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించి చివరిగా నిమజ్జనం చేస్తారు. ఈ వేడుకలు పట్టణాలలో కంటే పల్లెల్లోనే స్త్రీలు అత్యంత భక్తిశ్రద్ధలతో ఉపవాసాలు చేస్తూ తమ ఇష్టదైవమైన గౌరమ్మను కొలుస్తూ కోరికలు తీర్చే తల్లి అంటూ పాటలతో నత్యాలతో అలరించి భజంత్రీలతో ధూప దీప నైవేద్యాలతో పూనకాలతో చివరి ఘట్టంగా నిమజ్జనం చేస్తారు. పల్లెల్లో సద్దుల బతుకమ్మ కన్నుల పండుగగా ఉంటుంది అనటంలో అతిశయోక్తి లేదు. కాగా ఆదివారం ములుగు జిల్లా వాజేడు మండలం మరుమూరు గ్రామపంచాయతీ పరిధిలో గల మొట్లగూడెం గ్రామంలో సద్దుల బతుకమ్మ సంబరాలు జరిగాయి. పిల్లలు పెద్దలు స్త్రీలు గ్రామస్తులు గిరిజన నత్యాలతో ఆడి పాడి అలరించి భక్తిశ్రద్ధలతో పోయిరా గౌరమ్మ... పోయిరావమ్మా.. అంటూ బతుకమ్మను గంగమ్మ ఒడిలోకి చేర్చారు. ఈ కార్యక్రమమునకు అన్ని విధాల సహకరించిన గ్రామస్తులకు బతుకమ్మ యూత్ కమిటీ కతజ్ఞతలు తెలిపారు.

## కాంగ్రెస్ పార్టీ నుండి బిఆర్ఎస్‌లో చేరిక



రాయపర్తి, అక్టోబర్ 22, మనం న్యూస్ : రాయపర్తి మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ నేతలు ఐత రాజు ఆధ్వర్యంలో జంపి, రాకేష్, రాము, ప్రశాంత్, రాఘవ్, మహేష్, రాజు, సందీప్, చందు బిఆర్ఎస్ పార్టీలో చేరగా, వారికి గులాబీ కండువాలు కప్పి మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు పార్టీలోకి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పల్లెల్లో ఘనంగా సద్దుల బతుకమ్మ వేడుకలు



చెన్నారావుపేట, అక్టోబర్ 22, మనం న్యూస్ : భగవంతుడిని పూజించే పూలనే భగవంతుడిగా పూజిస్తూ తీరొక్క పూలతో బతుకమ్మలను పేరుస్తూ బతుకమ్మలోని పుష్పాలు తమ ఇంటి మహాలక్ష్మి నవ్వులు అనుకుంటూ చెన్నారావుపేట మండలంలో తొమ్మిది రోజుల పాటు బతుకమ్మను కొలుస్తున్న సద్దుల బతుకమ్మ ఆదివారం నాడు అంగరంగ వైభవంగా ఆడపడుచుల ఆటపాటలతో ఉయ్యాల వంగుడు కొమ్మలతో సద్దుల బతుకమ్మగా మురిసి ముగిసింది.

## ఆధ్యాత్మిక జీవితముతో మనసుకు ప్రశాంతత



చెన్నారావుపేట, అక్టోబర్ 22, మనం న్యూస్ : ఆధ్యాత్మిక జీవితముతో మనసుకు ప్రశాంతత లభిస్తుందని పాస్టేట్ చైర్మన్లు రెవ పి బాబురావు, రెవ. సెదరులు అన్నారు. మండల కేంద్రంలోని సిఎస్ఐ చర్చిలో ఆదివారం కోతకాల, కతజ్ఞతార్పనల పండుగ వేడుకలు జరుపుకున్నారు. సందర్భంగా వారు మాట్లాడుతూ దేవుడు చేసిన మేలుతో కతజ్ఞత కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో డికెన్‌లు దీపక్, ఇమ్మానియేలు, వరంగల్ గ్రూప్ సెక్రటరీ ఆకుల అశోక్, పాస్టేట్ సెక్రెటరీ గోపు శ్రీనివాస్ రెడ్డి, ట్రెజరర్ బిక్షపతి, మిషన్ అండ్ ఇవాంజలిజం సెక్రటరీ రవీందర్, యూత్ సెక్రటరీ గట్ల హనోక్, ట్రెజరర్ శంకేసి రంజిత్, అమ్మగారు స్వప్న, స్త్రీల మైత్రి సెక్రెటరీ గాండ్ల మంజుల, ట్రెజరర్ ఆకుల సుభాషిని, సంఘ సభ్యులు పాల్గొన్నారు

# బిఆర్ఎస్‌లో పట్టు కోసం పోరాటం..!!

- అద్దె మనుషులతో గొప్ప కోసం ఆరాటం..!!
- ఇది మండలంలో ప్రస్తుతం బిఆర్ఎస్ పరిస్థితి

వెంకటాపురం నుగూరు, అక్టోబర్ 22, మనం న్యూస్ : మండల బిఆర్ఎస్‌లో ఇటీవల కాలంలో వింత పరిస్థితులు నెలకొన్నాయి. గత దశాబ్ద కాలంగా ఈ ప్రాంతానికి చెందిన నాయకుడు ఖమ్మం జిల్లాలో రెండు సార్లు ఎమ్మెల్సీగా టిడిపి, బిఆర్ఎస్ హయాంలో పనిచేసిన బాలసాని లక్ష్మీనారాయణ పార్టీని వీడడంతో మండల టిఆర్ఎస్ లో వింత పోకడలు కనిపిస్తున్నాయి. గత కొంతకాలంగా బిఆర్ఎస్ పార్టీలోనే బాలసాని వర్గానికి దూరంగా ఉంటూ తనకంటూ ఒక కేడర్ ని ఏర్పాటు చేసుకొని రాష్ట్రమంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావుకు అత్యంత సన్నిహితులుగా వ్యవహరిస్తున్న నేత ఇటీవల కాలంలో చేపడుతున్న వ్యవహారాలపై పలు విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. బాలసాని టిఆర్ఎస్ పార్టీని వేయడంతో ఇక మండలంలో తనకు తిరుగు లేదని అంతా తానే వ్యవహరిస్తూ సదరు నాయకుడు విమర్శల పాలవుతున్నారు. త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో భద్రాచలం అసెంబ్లీ నియోజకవర్గ ఇంచార్జి గా ఖమ్మం ఎమ్మెల్సీ తాతా మజ్ను టిఆర్ఎస్ అధిష్టానం నియమించింది. ఆయన నియామకంతోనే మండలానికి చెందిన బిఆర్ఎస్ కీలక నేత తన సామాజిక వర్గానికి చెందిన నాయకుడే నియోజకవర్గ బాధ్యులుగా ఉండడంతో తనకున్న పాత పరిచయాలతో ఆయనకు దగ్గరగా వ్యవహరిస్తూ రానున్న ఎన్నికల్లో బిఆర్ఎస్ అభ్యర్థి విజయానికి తన శక్తివంచన లేకుండా కషి చేస్తానని చెబుతున్నాడు. కాకపోతే పార్టీ అధిష్టానం విషయంలో తానేంటో నిరూపించుకోవడం కోసం ప్రయత్నాలు చేస్తున్నాడు. వెంకటాపురం మండలంలో బిఆర్ఎస్ పార్టీ ప్రచార రధాన్ని సైతం తానే సొంత ఖర్చులతో ఏర్పాటు చేసుకొని మండలంలో బిఆర్ఎస్ పార్టీకి అత్యధిక మెజార్టీ తీసుకువస్తానని అధిష్టానం పెద్దల వద్ద ఇప్పటికే హామీ ఇచ్చినట్టు తెలిసింది. దాంతో పార్టీ నిర్వహిస్తున్న సమావేశాలకు బిఆర్ఎస్ క్యాడర్‌లో చాలామంది హాజరు కాకపోయినా అర్ధ బలంతో జనాన్ని తరలిస్తున్నారని విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. బాలసాని లక్ష్మీనారాయణ బిఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేయడంతో మండలానికి చెందిన ప్రధాన కేడర్ పూర్తిస్థాయిలో ప్రస్తుతం సమావేశాలకు హాజరు కాని పరిస్థితి నెలకొన్నది. దీంతో పార్టీ పెద్దలు పెట్టే సమావేశాలకు జనాలు హాజరు కాకపోతే తన విలువ తగ్గిపోతుంది అనే ఉద్దేశంతో డబ్బులు ఇచ్చి మరి మండల వ్యాప్తంగా వివిధ గ్రామాల నుండి ప్రైవేట్ వాహనాల్లో జనాల్ని తరలిస్తుండడం విశేషం. కేవలం డబ్బుని నమ్ముకొని ఈ నేత రాజకీయాలు చేస్తారని వాదన ఎంతోకాలంగా ఈ ప్రాంతంలో వినిపిస్తూనే ఉంది. ఎన్నికల సమయంలోనే పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటూ, అనంతరం పార్టీ క్యాడర్ను ఏమాత్రం పట్టించుకోకుండా కేవలం తన స్వప్రయోజనాల కోసమే పార్టీలో పనిచేస్తుంటాడని విమర్శలు సైతం అధికంగా ఉన్నాయి. పది రోజుల క్రితం మండల కేంద్రంలో జరిగిన బిఆర్ఎస్ పార్టీ సమావేశంలోనూ బాలసాని వర్గానికి చెందిన ఏ ఒక్క నాయకుడు కార్యకర్త ఈ ఏర్పాటు చేసిన సమావేశాలకు రాకపోవడం విశేషం. వివిధ పార్టీలకు చెందిన వేరే వ్యక్తులను డబ్బులు ఇచ్చి మరి సమావేశాలకి తరలించాడని ప్రజలు విమర్శించారు. తాజాగా ఆదివారం మండల కేంద్రంలో భద్రాచలం నియోజకవర్గం టిడిపి అభ్యర్థి తెల్లం వెంకట్రావు, నియోజకవర్గ బిఆర్ఎస్ ఇంచార్జి, ఎమ్మెల్సీ తాత మధు హాజరైన సమావేశానికి సైతం ప్రైవేట్ వ్యక్తుల పైన ఆధారపడి పైసలు ఇచ్చి ప్రజలను తరలించాలని పలువురు ఆరోపిస్తున్నారు. అసలు బిఆర్ఎస్ కేడర్ నాయకులు కేవలం కొందరు మాత్రమే నామమాత్రంగా ఈ సమావేశానికి హాజరయ్యారని, ఎక్కువ శాతం నాయకులు కార్యకర్తలు ఈ సమావేశానికి హాజరు కాలేదని పలువురు విమర్శిస్తున్నారు. కేవలం పైసలతోనే రాజకీయాలు చేస్తూ, తనకే కేడర్లో బలం ఉందని నేర్పించుకోవడం కోసమే సదరుకోనేత చేస్తున్న వ్యవహారంపై పలు విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. డబ్బుతోనే రాజకీయాలు చేస్తే ప్రజల్లో ఎక్కువ కాలం రాజకీయాల్లో మన గలగలేరనేది జగమెరిగిన సత్యం. ఆదివారం నాడు మండల కేంద్రంలో జరిగిన బిఆర్ఎస్ పార్టీ సమావేశంలో సైతం కేవలం నామమాత్రంగానే కార్యకర్తలు నాయకులు హాజరయ్యారని పలువురు విమర్శిస్తున్నారు.

# కొమరం భీమ్ ఆశయాలను సాధిద్దాం

- ఎన్నికల వేల రాజకీయ పార్టీలకు గుర్తు రాని గోండు వీరుడు..
- జీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి పూనెం సాయి



వెంకటాపురం నుగూరు, అక్టోబర్ 22, మనం న్యూస్ : తెలంగాణ విముక్తి కోసం, ఆదివాసీల హక్కుల కోసం అలుపెరుగని పోరాటం చేసిన కొమరం భీమ్ జయంతి రాజకీయ పార్టీలకు గుర్తుకు రాకపోవడం శోచనీయం అని పూనెం సాయి విమర్శించారు. ఆదివారం మండల కేంద్రంలోని కొమరం భీమ్ విగ్రహానికి ఆయన జయంతి సందర్భంగా పూనెం సాయి, చింత సోమరాజు పూల మాలలు వేశారు. కొమరం భీమ్ ఆదివాసీల ఆరాధ్య దైవం కావడంతో ఆయన జయంతిని మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. అనంతరం జీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి పూనెం సాయి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఎన్నికలు సమీపించిన వేళ ఆదివాసీల ఊసే లేదన్నారు. ఆదివాసి నిరుద్యోగులు ఉద్యోగాలు లేక ఉపాధి కోసం పట్టణాలకు వలస వెళ్లే పరిస్థితి దాపురించిందన్నారు. ఏజెన్సీ డిఎస్సి పదేళ్లలో ఒక్కసారి కూడా నిర్వహించలేదన్నారు. ఏజెన్సీ ఉద్యోగాలన్నీ మైదాన ప్రాంత గిరిజనేతరులకు పంచి పెట్టిన భారాస పార్టీకి, పదకొండు గిరిజనేతర కులాలను ఎస్టీ జాబితాలో కలపాలని శాసన సభలో తీర్మానం ప్రవేశ పెట్టినప్పుడు ప్రతిపక్ష పార్టీ వ్యతిరేకించక పోవడం చూస్తే ఈ రెండు పార్టీల డొల్లతనం బయట పడిందని కాంగ్రెస్, భారాస పార్టీల పైన ఆయన మండిపడ్డారు. ఏ ఒక్క రాజకీయ పార్టీ ఏజెన్సీ ప్రాంత చట్టాలను వంద శాతం అమలు చేస్తామని గాని, జిఓ 3 ని చట్టం చేస్తామని గాని తమ మ్యానిఫెస్టోలో పొందు పర్చలేదన్నారు. ఈ దగా కోరు రాజకీయ పార్టీలను ఏజెన్సీ ప్రాంతం నుండి తరిమి కొట్టాలని ఆయన ఆదివాసీలకు పిలుపునిచ్చారు. కొమరం భీమ్ ఆశయాల అమలు కొరకు ఆదివాసీలు అంతా సంఘటితంగా ఈ భూర్జువా రాజకీయ పార్టీలను బొందపెట్టాలని పార్టీల వైఖరి పైన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివాసీల పక్షాన నిలబడని ఏ ఒక్క రాజకీయ పార్టీకి ఓటు వేసే ప్రసక్తే లేదన్నారు. పర్సిక సతీష్, కంతి వెంకట్, పాయం కష్ణ తదితరులు జయంతి ఉత్సవాల్లో పాల్గొన్నారు.

# పరకాలలో ఖాళీ అవుతున్న కారు

- బిఆర్ఎస్, కాంగ్రెస్ నుండి బిజెపిలో చేరికలు



పరకాల, అక్టోబర్ 22, మనం న్యూస్ : నడికూడ మండలం రామకష్ణాపూర్ గ్రామానికి చెందిన బిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు చెందిన 50 మంది కార్యకర్తలు ఆదివారం రోజు బిజెపి హన్మకొండ పార్టీ కార్యాలయంలో పరకాల మాజీ ఎమ్మెల్యే మొలుగూరి బిక్షపతి ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ బిజెపి కండువాలు కప్పి ఆహ్వానించారు. పద్మశాలి కుల పెద్దమనిషి ముల్కరాజుతో పాటు ముల్క రాజేష్, ముల్క రంజిత్, తౌటం సందీప్, బూర రాకేష్, బూర నవీన్, ఎరుకల సందీప్, పెండ్లి హరికష్ణ, ఎరుకల సతీష్, పెళ్లి విష్ణు, గాజ నవీన్, పేంతల నవీన్, యార ఆకేష్, ఎరుకల వినయ్, ఎరుకల విష్ణు, ఎరుకల వినయ్, ఎరుకల నితిన్, ఎరుకల ఉదయ్, కడుదుల ప్రదీప్ తదితరులు భారతీయ జనతా పార్టీలో చేరడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరకాల నియోజకవర్గంలో బిఆర్ఎస్ పార్టీ ఖాళీ అవుతుందని అన్నారు. ప్రతి ఒక్కరూ నరేంద్ర మోడీ సంక్షేమ పథకాలను చూసి బిజెపి పార్టీలో చేరుతున్నారని, బిజెపి పార్టీలో చేరిన కార్యకర్తలను తన కంటికి రెప్పలా కాపాడుకుంటానని ప్రతి కార్యకర్త పరకాల నియోజకవర్గంలో బిజెపి జెండా ఎగరవేసేందుకు ఒక సైనికుడు వాలే పనిచేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి పట్టణ అధ్యక్షుడు మార్త బిక్షపతి, బీజేవైఎం నాయకులు ఎరుకల దివాకర్, పరకాల మున్సిపల్ మాజీ చైర్మన్ మార్త రాజభద్రయ్య, సీనియర్ నాయకులు దుబాసి వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

## చిల్పూర్ మండలంలో ఘనంగా సద్దుల బతుకమ్మ వేడుకలు

చిల్పూర్, అక్టోబర్ 22, మనం న్యూస్ : సద్దుల బతుకమ్మను పురస్కరించుకొని మండల కేంద్రంతో పాటు మండలంలోని అన్ని గ్రామాలలో ఆదివారం సాయంత్రం సద్దుల బతుకమ్మ వేడుకల్లో మహిళలు పాల్గొని ఘనంగా నిర్వహించారు. ఈనెల 14న ప్రారంభమైన నవరాత్రుల బతుకమ్మ ఉత్సవాలలో తొమ్మిది రోజులపాటు వేడుకల్లో పాల్గొని చివరి రోజు అయిన ఆదివారం మండలంలోని అన్ని గ్రామాలతో పాటు మండల కేంద్రంలో ఊరి చివరన గల బతుకమ్మ ఆట స్థలాల వద్దకు భారీ సంఖ్యలో చేరుకున్న మహిళలు గుంపులు గుంపులుగా బతుకమ్మ వేడుకలను నిర్వహించుకున్నారు. గ్రామాల్లోని ప్రతి కుటుంబం నూతన వస్త్రాలను ధరించి, తంగేడు పువ్వు, గునుగు పువ్వు, బంతిపూలతో సహా వివిధ రకాల పూలతో పేర్చిన బతుకమ్మలను తీసుకుని ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన బతుకమ్మ ఆట స్థలాలకు చేరుకున్నారు. ఆదివారం సాయంత్రం 6 గంటల నుండి ప్రారంభమైన బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న మహిళలు బంగారు బతుకమ్మ పాటలతో, ఆటలతో ఆయా ప్రాంతాలు మారు మోగాయి. దాదాపు రాత్రి 10 గంటల వరకు కోలాటాలు, డప్పుచప్పులతో బతుకమ్మ పాటలతో, ఆటలను ముగించుకున్నారు. సద్దుల బతుకమ్మ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చిల్పూర్ ఎస్సై ఆధ్వర్యంలో పోలీసులు మండల కేంద్రంలో పాటు వివిధ గ్రామాలలో బందోబస్తు నిర్వహించారు. అంతేగాక ఆయా గ్రామాల్లో బతుకమ్మ సంబరాలకు గ్రామపంచాయతీ అధికారులు, సిబ్బంది తగు ఏర్పాట్లు చేశారు.

## మృతుల కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే సీతక్క



ములుగు, అక్టోబర్ 22, మనం న్యూస్ : ములుగు మండల జంగాలపల్లి గ్రామానికి చెందిన దైవజనులు చార్లెస్ రాజు అకస్మాత్తుగా రోడ్డు ప్రమాదంలో మతి చెందగా వారి కుటుంబాన్ని, మాడబోయిన పెద్ద కనకయ్య మతి చెందగా వారి కుటుంబాన్ని ఏఐసిసి జాతీయ మహిళా ప్రధాన కార్యదర్శి, ములుగు ఎమ్మెల్యే దనసరి సీతక్క ఆదివారం పరామర్శించి వారి కుటుంబానికి అండగా కాంగ్రెస్ పార్టీ ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర, జిల్లా, మండల, గ్రామ నాయకులు, ప్రజా ప్రతినిధులు, యువజన నాయకులు, మహిళా నాయకురాళ్ళు తదితరులు పాల్గొన్నారు.

## పూలను దేవుళ్ళుగా పూజించే గొప్ప సంస్కృతి మన తెలంగాణది

- స్వరాష్ట్రంలో సగౌరవంగా బతుకమ్మ వేడుకలు
- ప్రజలందరికి సద్దుల బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు
- ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్



వరంగల్, అక్టోబర్ 22, మనం న్యూస్ : ప్రజలకు, ఆడబిడ్డలకు సద్దుల బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్. స్వరాష్ట్రంలో ముఖ్యమంత్రి కేసీఆర్ అంగరంగ వైభవంగా బతుకమ్మ వేడుకలను నిర్వహిస్తున్నారన్నారు. దేవుళ్ళను పూలతో పూజిస్తాం .. పూలనే దేవుళ్ళుగా పూజించే గొప్ప సంస్కతి తెలంగాణది అన్నారు. ఆడబిడ్డల కనుల పండుగ, తెలంగాణ ఆత్మగౌరవ ప్రతీక బతుకమ్మ పండుగ అని, ఈ పండుగను ప్రజలంతా సంతోషంగా జరుపుకోవాలన్నారు. స్వరాష్ట్రంలో సగౌరవంగా బతుకమ్మ వేడుకలు జరుగుతున్నాయని, తెలంగాణ, వరంగల్ తూర్పు ప్రజలకు, ఆడబిడ్డలకు బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్.

## రాయపర్తి రిపోర్టర్ రాజు కుటుంబాన్ని పరామర్శించిన మంత్రి ఎర్రబెల్లి



రాయపర్తి, అక్టోబర్ 22, మనం న్యూస్ : వరంగల్ జిల్లా పాలకుర్తి నియోజకవర్గం రాయపర్తి మండలం ఈనాడు రిపోర్టర్ మచ్చ రాజు తల్లి మచ్చ పద్మ అనారోగ్యం కారణంగా మరణించగా వారి కుటుంబ సభ్యులను రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివద్ధి, ఆర్ డబ్ల్యూ ఎస్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు పరామర్శించి మనోధైర్యాన్ని కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కార్నర్ సేవ రెడ్డి, జెడ్పిటిసి రాంకుమార్ గౌడ్, మండల అభివద్ధి కమిటీ చైర్మన్ బిల్లా సుధీర్ రెడ్డి, ఎంపిటిసిలు రామచందర్, బిల్లా రాధిక సుభాష్ రెడ్డి, మండల పార్టీ నాయకులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## చర్చిలో ప్రార్థనలకు హాజరైన ఎమ్మెల్యే నరేందర్



వరంగల్ టౌన్, అక్టోబర్ 22, మనం న్యూస్ : వరంగల్ లేబర్ కాలనీ లోని బేతేనియా చర్చ్ లో మత ప్రార్థనలకు వరంగల్ తూర్పు ఎమ్మెల్యే హాజరై ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నరేందర్ కు పాస్టర్ ఆశీర్వాదం అందజేసారు.



వరంగల్ జిల్లా రాయపర్తి మండలం కిష్టాపురం జాతీయ రహదారిపై ద్విచక్రవాహనంను కారు ఢీ కొట్టడంతో తండ్రి, కూతురు మతి చెందగా అల్లుడికి తీవ్ర గాయలు అయ్యాయి. క్షతగాత్రున్ని ఆసుపత్రికి తరలించారు. మతులు ఓరుగంటి వెంకన్న ముజంపల్లి అనూష గా గుర్తించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

- రాయపర్తి, అక్టోబర్ 22, మనం న్యూస్

## చెన్నూర్ టికెట్‌ను కాంగ్రెస్ పార్టీకే కేటాయించాలి

- చెన్నూర్ పట్టణ అధ్యక్షులు చెన్న సూర్యనారాయణ



మంచిర్యాల, అక్టోబర్ 22, (మనం న్యూస్): మంచిర్యాల జిల్లా చెన్నూరు (ఎస్.సి) నియోజక వర్గం హాట్ టాపిక్ గా మారింది. కాంగ్రెస్ పార్టీ నుంచి నిరసనలు, అభ్యర్థనలు పార్టీ అధిష్టానికి మొదలు అయ్యాయి. చెన్నూర్ టికెట్‌ను కాంగ్రెస్ పార్టీకే కేటాయించాలని చెన్నూర్ పట్టణ అధ్యక్షులు చెన్న సూర్యనారాయణ పార్టీ నాయకత్వానికి ఆదివారం నాడు విజ్ఞప్తి చేసారు. కొన్ని సామాజిక మాధ్యమాల ద్వారా చెన్నూర్ కాంగ్రెస్ పార్టీ టికెట్ సిపిఐకి కేటాయిస్తున్నట్లు వస్తున్న వార్తలను తామంతా తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. చెన్నూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ చాలా పటిష్టంగా ఉందని, కార్యకర్తలు బలంగా ఉన్నారని, గెలిచే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని అన్నారు. కాంగ్రెస్ పార్టీ కనుక చెన్నూర్ నియోజక వర్గానికి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికే టికెట్ కేటాయిస్తే గెలిపించి తీసుకొని వస్తామని అన్నారు. ఏఐసీసీ, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర, జాతీయ అధిష్టానం నాయకులు పునరాలోచించి చెన్నూర్ టికెట్ కాంగ్రెస్ కే కేటాయించాలని కోరుతున్నట్లు తెలిపారు. పార్టీ తమ స్థానిక నాయకుల, కార్యకర్తల మనోభిష్టాన్ని తప్పకుండ పరిగణలోకి తీసుకుంటుందన్న ఆశను అయన వ్యక్తం చేశారు

## కొత్తపల్లిలో వైభవంగా సద్దుల బతుకమ్మ వేడుకలు



కొత్తపల్లి, అక్టోబర్ 22, (మనం న్యూస్): కొత్తపల్లి పట్టణంలో ఆదివారం నిర్వహించిన సద్దుల బతుకమ్మ సంబరాలు అంబరాన్నంటాయి. పట్టణ మహిళలు ఎంతో భక్తిశ్రద్ధలతో రంగురంగుల పూలతో భక్తిశ్రద్ధలతో బతుకమ్మలను పేర్చారు. మహిళలు పిల్లలు ఆడపడుచులు ఆనంద ఉత్సవాల మధ్య భక్తి శ్రద్ధలతో బతుకమ్మలను కొలుచుకున్నారు. ఈ సందర్భంగా ఉత్సవాల్లో పాల్గొనే ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు దగ్గరుండి అన్ని ఏర్పాట్లు చేయించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, బిఆర్ఎస్ నాయకులు రుద్ర రాధ పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

## ఆర్మూర్‌లో బిజెపి నాయకుల సంబరాలు



ఆర్మూర్, అక్టోబర్ 22, (మనం న్యూస్): ఆర్మూర్ నియోజకవర్గ బిజెపి అభ్యర్థిగా అంకాపూర్‌కు చెందిన పైడి రాకేష్ రెడ్డిని బిజెపి అధిష్టానం ప్రకటించడంతో ఆర్మూర్‌లో ఆదివారం బిజెపి నాయకులు సంబరాలు చేశారు. బిజెపి అధిష్టానం ప్రకటించిన మొదటి జాబితాలో ఆర్మూర్ మండలం అంకాపూర్ కు చెందిన పైడి రాకేష్ రెడ్డి ఉన్నారు. బిజెపి అభ్యర్థిగా రాకేష్ రెడ్డి పేరు ప్రకటించగానే మొదట అంకాపూర్‌లో బాణసంచా కాల్చి మిఠాయిలు తినిపించుకున్నారు. ఆర్మూర్ అంబేద్కర్ చౌరస్తా వద్ద బిజెపి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో చేరి బాణసంచా కాల్చారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. అంబేద్కర్ చౌరస్తా నుంచి మామిడిపల్లి మీదుగా పెర్కిట్ వరకు ర్యాలీగా వెళ్లి బాణసంచా కాల్చారు. ఈ కార్యక్రమంలో బిజెపి నియోజకవర్గ కన్వీనర్ పాలెపు రాజు, బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి జివి నరసింహారెడ్డి, మండల అధ్యక్షుడు రోహిత్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు ధ్యాగ ఉదయ్, మాజీ సొసైటీ చైర్మన్ కవిత పోశెట్టి, నాయకులు దొండి ప్రకాష్, సురేష్ రెడ్డి, సంతోష్ రెడ్డి, దేగాం యాదగిరి, ఖానాపూర్ వినోద్, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## శమీ పూజను విజయవంతం చేయాలి




మంచిర్యాల, అక్టోబర్ 22, (మనం న్యూస్): దసరా పండుగ సందర్భంగా సోమవారం జరిగే జమ్మి పూజ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయదశమి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని 17వ వార్డు కౌన్సిలర్ పూదరి సునీత ప్రభాకర్ కోరారు. బతుకమ్మ నిమజ్జనం కొరకు 17వ వార్డ్ లో జమ్మి పూజ కార్యక్రమం కోసం పోచమ్మ చెరువు కట్టపై లైటింగ్, క్లీనింగ్ , మైసమ్మ గుడికి, నాగ దేవత గుడికి చుట్టూ ,చెట్ల చుట్టూ ఉన్న గద్దెలకు, మెట్లకు కలరింగ్ అన్ని ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. శ్రీ వెంకటేశ్వర పెయింటర్స్ తన్నీరు మధుకర్ ఇచ్చిన పదివేల రూపాయల విరాళాలతో అలంకరించినట్లు తెలిపారు. వార్డు మహిళా సోదరీ సోదరీమణులకు, ప్రజలకు, కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులు, నాయకులు, అభిమానులు, కార్యకర్తలకు దసరా శుభాకాంక్షలు తెలిపారు.

# చెన్నూర్ టికెట్‌ను కాంగ్రెస్ అభ్యర్థికే కేటాయించాలి

- ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి కొత్తూరి ఆశన్న



మందమర్రి, అక్టోబర్ 22, (మనం న్యూస్): కాంగ్రెస్ పార్టీ, వామపక్ష పార్టీల పొత్తులో భాగంగా చెన్నూర్ అసెంబ్లీ టికెట్ ను వామపక్షాలకు కేటాయించనున్నట్లు వస్తున్న వార్తలను కాంగ్రెస్ కార్యకర్తలు జీర్ణించుకోలేకపోతున్న నేపథ్యంలో తప్పకుండా కాంగ్రెస్‌కే ఈ సీటు కేటాయించాలని కాగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి కొత్తూరి ఆశన్న అన్నారు. గత 15 సంవత్సరాల నుంచి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తమ అభ్యర్థుల గెలుపుకోసం కృషిచేస్తున్నారని,గత 2018 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటి చేసిన వెంకటేష్ నేత కోసం చాల కష్టపడ్డారన్నారు. అప్పటినుంచి నేటి వరకు కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేస్తున్నారన్నారు. ఈ ఎన్నికల్లో కెసిఆర్ పాలన మీద, ఎమ్మెల్యే బాల్క సుమన్ మీద వ్యతిరేకతతో చెన్నూర్ నియోజకవర్గ ప్రజలు బిఆర్ఎస్ పార్టీనీ , బాల్క సుమన్ ఓడించడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. స్థానికేతరుడైన బాల్క సుమన్ గత ఎన్నికల్లో చెన్నూర్ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదన్నారు. ఈ సారి 100 శాతం గెలిచే సీటును వామపక్షాలకు కేటాయించాలనుకోవడం సరైన నిర్ణయం కాదన్నారు. గత 5 సంవత్సరాల నుంచి చెన్నూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా పిసిసి మెంబర్ నూకల రమేష్ గడప గడపకు వెళ్లి కాంగ్రెస్ పార్టీ కోసం ఎండనక, వాననక తిరిగి ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చారన్నారు. అదే విధంగా డాక్టర్ వృత్తికి రాజీనామా చేసి చెన్నూర్ నియోజకవర్గ ప్రజలకు సేవ చేయడమే లక్ష్యంగా డాక్టర్ రాజా రమేష్ ప్రజలతో మమేకమై, ప్రజల సాదకబాదకాలను తెలుసుకుంటు కాంగ్రెస్ పార్టీని నియోజకవర్గంలో బలోపేతం చేశారన్నారు. మరో డాక్టర్ దాసరపు శ్రీనివాస్, ఉస్మానియా విద్యార్థి నాయకుడు దుర్గం భాస్కర్, సామాజిక నాయకురాలు రామిల్ల రాధిక ఇలా దాదాపుగా 13 మంది కాంగ్రెస్ నాయకులు కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేస్తున్నారన్నారు. ఇంత మంది నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీ గెలుపుకోసం అహర్నిషలు కష్ట పడ్డారని,ఈ నాయకులను కాదని సిపిఐకి టికెట్టు కట్టబెట్టుకోవాలనుకోవడం సమంజసం కాదన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఆలోచించి టికెట్ కోసం ధరఖాస్తు చేసుకున్న ఈ 13 మందిలో ఒకరికి టికెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మహంకాళి శ్రీనివాస్, లక్ష్మి, జిల్లపెల్లి ఆకాష్, నక్క అజయ్, నరేష్, లింగంపెల్లి బాపు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# అంబరాన్నంటిన సంబురాలు

- ఆనందోత్సాహాల మధ్య సద్దుల బతుకమ్మ వేడుకలు

కొమురంభీం ఆసిఫాబాద్, అక్టోబరు 22, (మనం న్యూస్): తెలంగాణ సంస్కృతి, సంప్రదాయానికి ప్రతీక అయిన సద్దుల బతుకమ్మ వేడుక జిల్లా వ్యాప్తంగా ఘనంగా జరిగింది. తీరొక్క పూలను సేకరించి ఇళ్ల లో బతుకమ్మను పేర్చారు. ఆయా ఆలయాల్లో గ్రామాల కూడళ్ల వద్ద బతుకమ్మలను ఉంచి పాటలు పాడారు. అనంతరం శోభయాత్రగా బతుకమ్మలను తీసుకెళ్లి నదీ ప చెరువులు, వాగుల సమీపంలో సామూహికంగా బతుకమ్మలను నిమజ్జనం చేశారు. ఒకరికొకరు వాయినాలు ఇచ్చి పుచ్చుకొని బతుకమ్మ సంబరాలను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. సద్దుల బతుకమ్మ వేడుకలు ఆదివారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా జరిగాయి. బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో... బంగారు బతుకమ్మ ఉయ్యాలో... శ్రీరామ రామ ఉయ్యాలో.. రామనే శ్రీరామ ఉయ్యాలో, హరిహరి ఓ దేవ ఉయ్యాలో, హరియో బ్రహ్మదేవ ఉయ్యాలో, అంటూ మహిళలు బతుకమ్మ పాటలతో హోరెత్తిం చారు. ఆలయ ప్రాంగణాల్లో, వీధులు, కూడళ్ల వద్ద మహిళలు బతుకమ్మ ఆటల సందడి కనువిందు చేసింది. చిన్నా పెద్ద తేడా లేకుండా మహిళలు సంప్రదాయ వస్త్రాలు కరణలతో లయబద్ధంగా ఆడుతూ, పాడుతూ, సద్దుల బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్నారు. మహిళలు పోటీ పడి విచిన్న రూపాల్లో బతుకమ్మలను పేర్చి అందంగా తీర్చిది. డ్డారు. నూతన వస్త్రాలు, నగలు ధరించి ఒక్క చోట చేరి బతుకమ్మ చుట్టు తిరుగుతూ పాటలు పాడుతూ ఆడడంతో పాటు యువతులు, మహిళలు కోలాటం ఆడారు. పట్టణంలో బ్రహ్మణ్వాడ, రావులవాడ, కన్యకాపరమేశ్వరి ఆలయం. పొట్టి శ్రీరాములు చౌక్, కంచుకోట, తారక రామానగర్, రాజంపేట, సాయినగర్, పైకాజీనగర్, బజార్ డీ హడ్కో కాలనీ, సందీప నగర్, జన్కాపూర్, దస్నాపూర్ కాలనీల్లో మహిళలు ఆడి పాడారు. అనతరం పెద్దవాగులో సామూహికంగా బతుకమ్మలను నిమజ్జనం చేశారు కాగజ్నగర్ పట్టణంతో పాటు జిల్లాలోని సిర్పూర్(టి), కౌటాల, చింతలమానెపల్లి, బెజ్జూరు, దహెగాం, పెంచికలపేట, రెబ్బెన, వాంకిడి, కెరమెరి, జైనూర్, సిర్పూర్‌య లింగాపూర్, తిర్యాణి మండలాల్లో మహిళలు ఆనందోత్సాహాలమధ్యసద్దులబతుకమ్మసంబరాలనుజరుపుకున్నారు.

# తెలంగాణ ఆవిర్భావం తర్వాతే తండాల అభివృద్ధి

- సభాపతి పోచారం శ్రీనివాస రెడ్డి



బాన్సువాడ, అక్టోబర్ 22, (మనం న్యూస్): తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాతనే గ్రామాలు, తండాల అభివృద్ధికి పుష్కలంగా నిధులు వస్తున్నాయని శాసన సభాపతి పోచారం శ్రీనివాస రెడ్డి అన్నారు. ఆదివారం పోతంగల్ మండలం జల్లాపల్లి అబాదిలో నూతనంగా నిర్మించిన జగదాంబ మాత- సేవాలాల్ మహారాజ్ మందిరాలు, విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతి తండాలో జగదాంబ మాత-సేవాలాల్ మహారాజ్‌ల దేవాలయాల నిర్మాణానికి నిధులు మంజూరు చేశానని తెలిపారు. బాన్సువాడ నియోజకవర్గానికి రాష్ట్ర ముఖ్యమంత్రి కెసిఆర్ రూ.500 కోట్ల స్పెషల్ డెవలప్ మెంట్ ఫండ్ ఇచ్చారని, వీటితో గ్రామాలు, తండాలలో సామాజిక అవసరాల కోసం కావలసిన నిధులను మంజూరు చేశానని తెలిపారు. మొదటి నుండి తమ కుటుంబానికి బంజారాలతో సన్నిహిత సంబంధాలు నెలకొన్నాయని, రాజకీయంగా బంజారాలు ఎప్పుడూ తన వెంటే ఉంటున్నారని గుర్తు చేసుకున్నారు. బంజారాల పిల్లల చదువుకోవడానికి నస్రుల్లాబాద్‌లో ఎస్టీ బాలుర రెసిడెన్షియల్ పాఠశాలఏర్పాటు చేయించి రూ. 13 కోట్లతో భవనాలు నిర్మించామన్నారు.అదేవిధంగా కోనాపూర్-హన్మాజీపేట వద్ద గిరిజన బాలికల గురుకుల పాఠశాల ఏర్పాటు చేసి, రూ. 12 కోట్లతో భవనాలను నిర్మిస్తున్నట్లు తెలిపారు. బాన్సువాడ నియోజకవర్గంలో36 తాండాలను గ్రామ పంచాయతీ లుగా మార్చామని తెలిపారు. ఈ కార్యక్రమంలోప్రజాప్రతినిధులు, బంజారా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కోల్‌బెల్ట్‌లో ఘనంగా సద్దుల బతుకమ్మ వేడుకలు

- ఆటపాటలతో సందడి చేసిన మహిళలు



మంచిర్యాల, అక్టోబర్ 22, (మనం న్యూస్): కోల్ బెల్ట్ ప్రాంతాల్లో సద్దుల బతుకమ్మ వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా తీరొక్క పూలతో పేర్చిన బతుకమ్మలతో మహిళలు ఆటపాటలతో సందడి చేసారు. మంచిర్యాలలోని రాంనగర్, పాత మంచిర్యాల, హమాలివాడా, బలిజ నగర్, మార్కెట్ ఏరియాల్లో వివిధ పూలతో పేర్చిన భారీ బతుకమ్మలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఆదివారం ఉదయమే మార్కెట్‌లో తంగేడు, బంతి, కట్ల పూలు రావడంతో కొనుక్కొని మధ్యాహ్నం బతుకమ్మగా పేర్చారు. సాయంత్రం ఆరు గంటల తర్వాత నుంచి బతుకమ్మలు వాడ వాడలా పెద్ద ఎత్తున మహిళలు ఆటపాటలు, కోలాటాలతో ఆడుతూ పాడారు. మంచిర్యాలతో పాటు కోల్ బెల్ట్ ప్రాంతాలైన నస్పూర్, శ్రీరాంపూర్ ప్రాంతాల్లోని ఆలయాల్లో, వీధుల్లో, ఇండి ముంగిల్లల్లో బతుకమ్మలతో వేడుకలను చేసుకున్నారు. కొన్ని చోట్ల పెద్ద బతుకమ్మలకు బహుమతులు ఇచ్చారు అనంతరం మంచిర్యాలలో రాముని చెరువు, పోచమ్మ చెరువు కట్ట, పాత మంచిర్యాల దగ్గర రాళ్ళ వాగులో బతుకమ్మలను పోయిరా గౌరమ్మా పోయిరావమ్మ, మళ్లి వచ్చే ఏడాది మళ్లి రావమ్మ అంటూ నీళ్ళల్లో సాగానంపారు. అనంతరం వెంట తెచ్చుకున్న సద్దులను ఒకరికి ఒకరు ప్రేమతో ఆప్యాయంగా వాయనాలు ఇచ్చుకున్నారు. అనంతరం ఎవరి ఇళ్ళకు వారు చేరి కుటుంభ సభ్యులతో సరదాగా గడిపారు.

## పూర్తయిన ఈవిఎంల తరలింపు ప్రక్రియ



నిజామాబాద్, అక్టోబర్ 22, (మనం న్యూస్): సాధారణ ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా చేపట్టిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల తరలింపు ప్రక్రియ ఆదివారం పూర్తయ్యింది. జిల్లా కేంద్రంలోని ఈవీఎం గోడౌన్ నుండి ఆయా అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాలకు ఈవీఎంలు తరలించే ప్రక్రియను శనివారం చేపట్టగా, ఆదివారం సాయంత్రం వరకు కొనసాగింది. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, అదనపు కలెక్టర్లు చిత్రామిశ్రా, పి.యాదిరెడ్డిల పర్యవేక్షణలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పకడ్బందీ ఏర్పాట్ల నడుమ ఈవీఎంల తరలింపు సాఫీగా ముగిసింది. రాండమైజేషన్ జాబితాను అనుసరిస్తూ కంట్రోల్ యూనిట్లు, బ్యాలెట్ యూనిట్లు, వివి.ప్యాట్లను సంబంధిత నియోజకవర్గాల రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారులకు అప్పగించగా, పోలీసు బందోబస్తు నడుమ కట్టుదిట్టమైన ఏర్పాట్లతో ప్రత్యేక వాహనాల్లో వాటిని నియోజకవర్గ కేంద్రాలకు తరలించి స్ట్రాంగ్ రూమ్ లలో భద్రపర్చారు. ఈ ప్రక్రియలో నిజామాబాద్ నగర పాలక సంస్థ కమిషనర్ ఎం.మకరంద్, నిజామాబాద్ రూరల్, బోధన్, బాన్సువాడ, ఆర్మూర్ నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు రాజేంద్ర కుమార్, రాజాగౌడ్, భుజంగరావు, వినోద్ కుమార్, సహాయ రిటర్నింగ్ అధికారులు, ఎన్నికల విభాగం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## అష్ఫాఖుల్లా ఖాన్‌ను యువత ఆదర్శంగా తీసుకోవాలి

- మాజీ సైనికులు రాజేష్ పివ్వాల్



మందమర్రి, అక్టోబర్ 22, (మనం న్యూస్): భారతదేశ స్వాతంత్రం కోసం ప్రాణ త్యాగానికి సిద్ధపడిన అష్ఫాఖుల్లా ఖాన్‌ను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని మాజీ సైనికులు, సింగరేణి సెక్యూరిటీ గార్డ్ రాజేష్ పివ్వాల్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన నివాసంలో అష్ఫాఖుల్లా ఖాన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భారత దేశం కోసం ప్రాణాలర్పించిన మహనీయుల్లో అష్ఫాఖుల్లా ఖాన్ ఒకరన్నారు. 27 ఏళ్లకే దేశం కోసం ప్రాణ త్యాగం చేశారని, ఎందరో వీరుల్లో అగ్గి రగిల్చిన గొప్ప వ్యక్తి ఆయన అని కొనియాడారు. భగత్ సింగ్ కంటే ముందే ఉరికంబాన్ని ముద్దాడి, అది తన అదృష్టంగా ప్రకటించిన ధీరోధాత్తుడన్నారు. ఆయన బతికి ఉన్నంత కాలం పేద ప్రజల కోసం ఆలోచించారని, దేశ విముక్తి కోసమే శ్రమించారని తెలిపారు. అష్ఫాక్ యోధుడే కాదు మంచి కవి మేధావి కూడా అని తెలిపారు. అలాంటి వీరుడిని బ్రిటీష్ ప్రభుత్వం 1927, డిసెంబర్ 19 న ఉరి తీసిందన్నారు. అష్ఫాఖుల్లా ఖాన్ చరిత్ర ప్రతి విద్యార్థి గుర్తు చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజేష్ రాణి పివ్వాల్ పాల్గొన్నారు.

## అమ్మవారిని దర్శించుకున్న బిఎస్పీ అభ్యర్థి తోట శ్రీనివాస్



మంచిర్యాల, అక్టోబర్ 22, (మనం న్యూస్): నస్పూర్ మున్సిపల్ వైస్ చైర్మన్, బీఎస్పీ నియోజక వర్గ ఇంఛార్జి తోట శ్రీనివాస్ సిసిసి లోని దుర్గాదేవి అమ్మవారిని ఆదివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, రాబోయే ఎన్నికల్లో తనకు విజయం ప్రసాదించాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో హిమ్మత్ నగర్‌లోని కార్యకర్తలు వనపర్తి రాజేష్, జాడి రాజు, అజయ్ పాల్గొన్నారు.

## బిఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ నాయకులు



మంచిర్యాల, అక్టోబర్ 22, (మనం న్యూస్): మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం లింగాపూర్, ద్వారక గ్రామాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు మంచిర్యాల ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు సమక్షంలో ఆదివారం బిఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.

## మానకొండూరులో పర్యటించిన ఆరెపల్లి మోహన్

- హనుమాన్ దేవాలయంలో ప్రత్యేక పూజలు
- బిజెపిలో చేరిన వార్డు సభ్యులు నీలమ్మ



మానకొండూరు, అక్టోబర్ 22, (మనం న్యూస్): మానకొండూరు మండలంలోని గట్టుదుద్దెనపల్లి, శంషాబాద్, వన్నారం గ్రామాల్లో బిజెపి అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్ ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా గట్టు దుద్దెనపల్లి గ్రామంలోని హనుమాన్ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గట్టుదుద్దెనపల్లి, శంషాబాద్, వన్నారం గ్రామాలలో బిజెపి ముఖ్య కార్యకర్తలను కలిసి బిజెపి కార్యకర్తలు సైనికుల్లా పనిచేసి బిజెపి గెలుపే లక్ష్యంగా పనిచేయాలని దిశా నిర్దేశం చేశారు. శంషాబాద్ గ్రామంలోని కాంగ్రెస్ పార్టీకి చెందిన వార్డు సభ్యులు కొయ్యడ నీలమ్మ బిజెపిలో చేరారు. ఈ సందర్భంగా ఆరెపల్లి మోహన్ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు అప్పని తిరుపతి, ఓబిసి మోర్చా ఉపాధ్యక్షులు మియాపురం లక్ష్మణచారి, కేశవపట్నం మాజీ ఎంపిపి దొంగల రాములు, వన్నారం ఉపసర్పంచ్ బుద్దుల తిరుపతి, మండల కార్యవర్గ సభ్యులు కోల శ్రీనివాస్, బీజేవైఎం మండల అధ్యక్షులు ప్రదీప్‌యాదవ్, ప్రధాన కార్యదర్శి గడ్డి శ్రీకాంత్, అనిల్ బూత్ అధ్యక్షులు సాగర్, రాకేష్, సురేష్, సంపత్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కొంపముంచిన టీమిండియా ఫీల్డింగ్.. ఏది కలిసి రావడం లేదు!

వన్డే ప్రపంచకప్ 2023లో భాగంగా న్యూజిలాండ్తో జరుగుతున్న మ్యాచ్లో టీమిండియాకు ఏది కలిసిరావడం లేదు. ఈ మ్యాచ్కు ముందే స్టార్ ఆల్రౌండర్ హార్దిక్ పాండ్యా గాయంతో దూరమవ్వడంతో టీమిండియా ఐదుగురు బౌలర్లతోనే బరిలోకి దిగింది. అసలే ఓ బౌలర్ తక్కువగా ఉన్నాడనుకుంటే.. టీమిండియా ఆటగాళ్ల చెత్త ఫీల్డింగ్ న్యూజిలాండ్ బ్యాటర్లకు కలిసొస్తోంది. వరల్ బెస్ట్ ఫీల్డర్ అయిన రవీంద్ర జడేజా సునాయస క్యాచ్ వదిలేస్తే.. వికెట్ కీపర్ కేఎల్ రాహుల్ మరో క్యాచ్ నేలపాలు చేశాడు. బౌండరీ లైన్ వద్ద జస్ప్రీత్ బుమ్రా మరో ఈజీ క్యాచ్ను వదిలేసాడు. ఈ మూడు అవకాశాలతో న్యూజిలాండ్ బ్యాటర్లు రెచ్చిపోయారు. ముఖ్యంగా ఫీల్డ్లో సింహంలా కదిలే జడేజా.. లడ్డూ లాంటి క్యాచ్ వదిలేసి అందర్నీ ఆశ్చర్యపరిచాడు. ఫీల్డింగ్లో అత్యంత తక్కువగా తప్పిదాలు చేసే జడేజా.. మూడేళ్ల తర్వాత క్యాచ్ వదిలేసాడు. చివరిసారిగా 2020లో జడేజా ఓ క్యాచ్ నేలపాలు చేశాడు. అతని తప్పిదంతో రచిన్ రవీంద్ర బచాయించాడు. 12 పరుగుల వ్యక్తిగత స్కోర్ వద్ద వచ్చిన ఈ అవకాశంతో చెలరేగిన అతను 75 పరుగులు చేశాడు. మూడో వికెట్కు 159 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. డారిల్ మిచెల్ ఇచ్చిన కష్టతరమైన క్యాచ్ను వికెట్ కీపర్ కేఎల్ రాహుల్ అందుకోలేకపోయాడు. 59 పరుగుల వ్యక్తిగత స్కోర్ వద్ద అతనికి తొలి లైఫ్ లభించగా.. 74 పరుగుల వ్యక్తిగత స్కోర్ వద్ద మరో అవకాశం లభించింది. కుల్దీప్ యాదవ్ వేసిన 33 ఓవర్ ఐదో బంతిని డారిల్ మిచెల్ భారీ షాట్ ఆడగా.. లాంగాఫ్లో బుమ్రాకు సునాయస క్యాచ్ వచ్చింది. కానీ అతను క్యాచ్ వదిలేయడంతో పాటు బంతిని బౌండరీలోకి నెట్టేసాడు.

# నిప్పులు చెరిగిన మహమ్మద్ షమీ.. కుప్పకూలిన న్యూజిలాండ్!



వన్డే ప్రపంచకప్ 2023లో భాగంగా న్యూజిలాండ్తో జరుగుతున్న మ్యాచ్లో టీమిండియా స్టార్ పేసర్ మహమ్మద్ షమీ(5/54) నిప్పులు చెరిగాడు. దాంతో ముందుగా బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ నిర్ణీత 50 ఓవర్లలో 273 పరుగులకు ఆలౌటైంది. డారిల్ మిచెల్(127 బంతుల్లో 9 ఫోర్లు, 5 సిక్సులతో 130) సెంచరీతో చెలరేగగా.. రచిన్ రవీంద్ర(87 బంతుల్లో 6 ఫోర్లు, సిక్స్తో 75) హాఫ్ సెంచరీతో రాణించాడు. ఈ ఇద్దరు మినహా మరే బ్యాటర్ చెప్పుకొదగ్గ ఇన్నింగ్స్ ఆడలేదు. భారత బౌలర్లలో షమీకి తోడుగా కుల్దీప్ యాదవ్(2/73) రెండు వికెట్లు తీయగా.. బుమ్రా (1/45), సిరాజ్(1/45) తలో వికెట్ దక్కించుకున్నారు.

శుభారంభం లేకున్నా..: టాస్ ఓడి బ్యాటింగ్కు దిగిన న్యూజిలాండ్కు శుభారంభం దక్కలేదు. ఇన్నింగ్స్ నాలుగో ఓవర్లోనే ఓపెనర్ డెవాన్ కాన్వే(0)ను మహమ్మద్ సిరాజ్ క్యాచ్ ఔట్గా పెవిలియన్ చేర్చాడు. ఈ టోర్నీలో ఆడుతున్న ఫస్ట్ మ్యాచ్ తొలి బంతికే షమీ.. విల్ యంగ్(17)ను క్లీన్ బౌల్ చేసాడు. దాంతో 19 పరుగులకే న్యూజిలాండ్ 2 వికెట్లు కోల్పోవడంతో క్రీజులోకి వచ్చిన డారిల్ మిచెల్, రచిన్ రవీంద్ర ఆచితూచి ఆడారు. దాంతో న్యూజిలాండ్ పవర్ ప్లేలో 2 వికెట్లకు 34 పరుగులే చేసింది. షమీ వేసిన 11వ ఓవర్లో రచిన్ రవీంద్ర ఇచ్చిన సునాయ క్యాచ్ను జడేజా నేలపాలు చేశాడు. ఈ అవకాశంతో చెలరేగిన అతను భారత స్పిన్నర్లను అటాక్ చేశాడు. భారీ షాట్లతో దూకుడు కనబర్చాడు. డారిల్ మిచెల్ సైతం ధాటిగా ఆడటంతో కివీస్ వేగంగా పరుగులు చేసింది. మూడు క్యాచ్లు నేలపాలు..:ఈ క్రమంలో రచిన్ రవీంద్ర 56 బంతుల్లో హాఫ్ సెంచరీ సాధించగా.. డారిల్ మిచెల్ 60 బంతుల్లో అర్థ శతకం పూర్తి చేసుకున్నాడు. ఇక జడేజా బౌలింగ్లో మిచెల్ ఇచ్చిన క్యాచ్ను కేఎల్ రాహుల్ అందుకోలేకపోయాడు. ఈ అవకాశంతో రెచ్చిపోయిన డారిల్ మిచెల్... కుల్దీప్ యాదవ్ బౌలింగ్లో మరో అవకాశం ఇచ్చాడు. కానీ బౌండరీ లైన్ వద్ద జస్ప్రీత్ బుమ్రా నేలపాలు చేశాడు. భారీ భాగస్వామ్యంతో దూసుకుపోతున్న ఈ జోడీని షమీ విడదీసాడు. రచిన్ రవీంద్రను క్యాచ్ ఔట్గా పెవిలియన్ చేర్చాడు. క్రీజులోకి వచ్చిన టామ్ లాథమ్(5)ను కుల్దీప్ యాదవ్ వికెట్ల ముందు బోల్తా కొట్టించాడు. వరుసగా వికెట్లు కోల్పోవడంతో కివీస్ పరుగుల వేగం తగ్గింది. ఫిలిప్స్ సాయంతో ఆచితూచి ఆడిన మిచెల్ 100 బంతుల్లో సెంచరీ పూర్తి చేసుకున్నాడు. గ్లేన్ ఫిలిప్స్(23)ను కుల్దీప్ యాదవ్ ఔట్ చేయగా.. మార్క్ చాప్మన్(6)ను కోహ్లీ స్టన్నింగ్ క్యాచ్ సాయంతో బుమ్రా ఔట్ చేశాడు. వరుస బంతుల్లో మహమ్మద్ షమీ మిచెల్ సాంట్నర్(1), మ్యాట్ హెన్రీ(0)లను క్లీన్ బౌల్ చేశాడు. భారీ షాట్లు ఆడే ప్రయత్నం చేసిన డారిల్ మిచెల్ను షమీ క్యాచ్ ఔట్ చేసి 5 వికెట్ల ఘనతను అందుకున్నాడు. ఆఖరి బంతికి లేని పరుగుకు ప్రయత్నించిన ఫెర్గూసన్(1) రనౌటవ్వడంతో న్యూజిలాండ్ ఆలౌటైంది.

## తొలి బంతికే వికెట్.. మహమ్మద్ షమీ అరుదైన ఘనత.!



ధర్మశాల: టీమిండియా స్టార్ పేసర్ మహమ్మద్ షమీ అరుదైన ఘనతను సొంతం చేసుకున్నాడు. వన్డే ప్రపంచకప్ 2023లో ఆడిన తొలి మ్యాచ్లోనే (5/54) నిప్పులు చెరిగాడు. హార్దిక్ పాండ్యా గాయంతో జట్టుకు దూరమవడంతో తుది జట్టులోకి వచ్చిన షమీ.. న్యూజిలాండ్తో జరిగిన మ్యాచ్లో సత్తా చాటాడు. ఈ ప్రదర్శనతో తన పేరిట పలు రికార్డులను లిఖించుకున్నాడు. ప్రపంచకప్లో అత్యధిక సార్లు ఐదు వికెట్ల ఘనతను అందుకున్న తొలి భారత బౌలర్గా చరిత్రకెక్కాడు. వన్డే ప్రపంచకప్లో ఇప్పటి వరకు 13 ఇన్నింగ్స్లు ఆడిన షమీ రెండు సార్లు ఐదు వికెట్ల ఘనతను అందుకోవడంతో పాటు 36 వికెట్లు పడగొట్టాడు. మరే భారత బౌలర్ కూడా రెండు సార్లు ఐదు వికెట్ల ఘనతను అందుకోలేదు. ఐదు వికెట్ల ఘనతను అందుకున్న భారత బౌలర్ల జాబితాలో మహమ్మద్ షమీతో పాటు కపిల్ దేవ్, వెంకటేశ్ ప్రసాద్, రాబిన్ సింగ్, ఆశిష్ నెహ్రా, యువరాజ్ సింగ్లు ఉన్నారు. 36 వికెట్లతో ప్రపంచకప్ చరిత్రలో అత్యధిక వికెట్లు తీసిన మూడో భారత బౌలర్గా షమీ అరుదైన ఘనతను సొంతం చేసుకున్నాడు. ఈ క్రమంలో అనిల్ కుంబ్లే రికార్డును అధిగమించాడు. ప్రపంచకప్లో అనిల్ కుంబ్లే 31 వికెట్లు పడగొట్టాడు. ఈ జాబితాలో 44 వికెట్లతో జహీర్ ఖాన్, జవగళ్ శ్రీనాథ్ తొలి రెండు స్థానాల్లో ఉన్నారు. తాజా ప్రపంచకప్లో అతను వరుసగా ఆడితే జహీర్ ఖాన్ రికార్డును బ్రేక్ చేయనున్నాడు. ఈ మ్యాచ్లో ముందుగా బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ నిర్ణీత 50 ఓవర్లలో 273 పరుగులకు ఆలౌటైంది. డారిల్ మిచెల్(127 బంతుల్లో 9 ఫోర్లు, 5 సిక్సులతో 130) సెంచరీతో చెలరేగగా.. రచిన్ రవీంద్ర(87 బంతుల్లో 6 ఫోర్లు, సిక్స్తో 75) హాఫ్ సెంచరీతో రాణించాడు. ఈ ఇద్దరు మినహా మరే బ్యాటర్ చెప్పుకొదగ్గ ఇన్నింగ్స్ ఆడలేదు. భారత బౌలర్లలో షమీకి తోడుగా కుల్దీప్ యాదవ్ (2/73) రెండు వికెట్లు తీయగా.. బుమ్రా(1/45), సిరాజ్ (1/45) తలో వికెట్ దక్కించుకున్నారు. భారత ఫీల్డర్లు మూడు సునాయస క్యాచ్లను నేలపాలు చేశారు. ఈ అవకాశాలతో చెలరేగిన డారిల్ మిచెల్, రచిన్ రవీంద్ర మూడో వికెట్కు 159 పరుగులు జోడించారు. భారత ఫీల్డర్లు ఆ క్యాచ్లు పట్టి ఉంటే న్యూజిలాండ్ ఇంత స్కోర్ కూడా చేసేది కాదు.

# మ్యాచ్ మధ్యలో ప్రత్యర్థితో పీవీ సింధు ఫైట్.. పెనాల్టీ వేసిన అంపైర్!

భారత బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధు, స్పెయిన్ టాప్ షట్లర్ కరోలినా మారిన్ మాటల యుద్ధానికి దిగారు. మ్యాచ్ మధ్యలోనే ఆట మానేసి నోటికి పని చెప్పారు. ఒక్కసారి కాదు.. మ్యాచ్ మధ్యలో అనేక సార్లు ఇద్దరూ ఇలా మాటల యుద్ధానికి దిగారు. దీంతో అంపైర్ కలుగజేసుకుని ఇద్దరికీ పెనాల్టీ విధించారు. డెన్మార్క్ ఓపెన్ 2023లో సెమీఫైనల్లో పీవీ సింధు, కరోలినా మారిన్ మధ్య శనివారం తలపడ్డారు. మ్యాచ్ సందర్భంగా ఇద్దరి మధ్య అనేకసార్లు



వాగ్వాదం జరిగింది. పాయింట్ సాధించిన ప్రతిసారి ఒకరినొకరు ఏదో ఒకటి అంటూ పరస్పరం నిందించుకున్నారు. ఒకానొక టైంలో ఇద్దరి అరుపులు, కేకలతో వాగ్వాదం తారస్థాయికి చేరింది. ఈ క్రమంలోనే సింధు, మారిన్లను చైర్ అంపైర్ అనేక సార్లు హెచ్చరించారు. అయినా ఇద్దరూ ఎక్కడా తగ్గలేదు. దానికి తోడు మూడో గేమ్లో సింధు త్వరగా సర్వ్ చేయక పోవడంపై కూడా అంపైర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. దీనిపై అంపైర్ సింధును ప్రశ్నించగా...' ఆమె అరిచేందుకు అవకాశమిచ్చారు కదా. ముందు ఆమెను ఆపమని చెబితే నేనూ సిద్ధంగా ఉంటా' అని సింధు బదులిచ్చింది. మరొకరి కోర్టు నుంచి షటిల్ తీసుకోవద్దని ఇద్దరికీ చెప్పాల్సి వచ్చింది. చివరకు అంపైర్ ఇద్దరికీ 'ఎల్లో కార్డు'లు కూడా చూపించాల్సి వచ్చింది. ఇక మ్యాచ్ విషయానికొస్తే.. తొలి రెండు గేమ్లలో ఇద్దరూ పోటాపోటీగా ఆడి చెరో గేమ్ను సొంతం చేసుకున్నా.. మూడో గేమ్లో కరోలినా విజృంభించింది. సింధును సునాయాసంగా ఓడించింది. దీంతో గేమ్తో పాటు మ్యాచ్ను కూడా సొంతం చేసుకుని సెమీస్ విజేతగా నిలిచింది. 73 నిముషాల పాటు సాగిన ఈ మ్యాచ్లో 18-21, 21-19, 7-21 పాయింట్లతో సింధు ఓటమిపాలైంది. ఇదిలా ఉంటే కరోలినా చేతిలో సింధుకు ఇది 11వ ఓటమి. ఈ మ్యాచ్కు ముందు వరకు ఇద్దరి మధ్య రికార్డ్ 5-10గా ఉన్న హెడ్ టూ హెట్ రికార్డ్.. ఈ మ్యాచ్ తర్వాత 5-11కు చేరింది.



































అందరికీ
విజయదశమి
శుభాకాంక్షలు





Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Nava Telangana Printers Private Limited, Near Manair Hanuman Temple, Godhavarikhani Bypass Road, Housing Board Colony, Karimnagar. 505001, Telangana. Published From H.No:6-3-864/4/B, SBN Arcade, 2nd Floor, Green lands, Opp: Green Park Hotel, Hyderabad - 500016 Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2017/73893. E-mail Id: editor@manamnews.com.